తిరుపతి వేంకటేశ్వరులొనర్చిన తెలుగు గ్రంథములు

—: ప్రబంధములు :—

శ్రవణానందము	2_00
పాణిగృహీత	2_00
లక్షణాపరిణయము	1_00
బుద్ధచరిత్రము	3_00
శ్రీనివాస విలాసము	2_50
ఏలా మాహాత్మ్యము	1_00
బొబ్బిలి పట్టాభిషేకము	1_50
పూర్వహరిశ్చంద్ర చరిత్రము	1_50
శివభక్తి	1_50
సుశీల	2_00
పతివ్రత	1_25
గోదేవి	1_25
జాతకచర్య (వెం॥శా॥చరిత్ర)	1_50
ఇటీవలిచర్య (డిటో)	1_50
దేవీ భాగవతము (పురాణం)	16_00
శివలీలలు (డిటో)	10_00

—: వివాదగ్రంథములు :—

గీరతము (4 భాగములు)	6_50
గుంటూరుసీమ (2 రంగములు)	6_00
వేమవరాగ్రహార శతావధానము	1_25
జయంతి	1_00
మల్లేశ్వర విజ్ఞప్తి	1_25

—: నాటకములు :—

పాండవ జననము	2_25
పాండవ ప్రవాసము	1_50
పాండవోద్యోగము	2_00
పాండవవిజయము	2_00
పాండవాశ్వమేధము	1_50
పాండవ రాజసూయము	0_50
దంభ వామనము	0_62
అనర్ఘనారదము	0_62
సుకన్య	0_62
పండిత రాజము	1_00
ప్రభావతీ ప్రద్యుమ్నము	1_50
మృచ్ఛకటికము	4_50
ముద్రారాక్షసము	2_00
బాలరామాయణము	4_00
ఎడ్వర్డు పట్టాభిషేకము	0_75
వ్యసన విజయము	0_50

—: ప్రహసనములు :—

రసాభాసము	0_25
త్రిలోకీ విజయము	0_75
పల్లెటూళ్ల పట్టుదలలు	0_75
అపూర్వ కవితా వివేచనము	0_50
కవిసింహ గర్జితములు	0_37

వేంకటేశ్వర పబ్లికేషన్సు

కడియం P. O. తూ॥ గో॥ జిల్లా.

శ్రీమత్పరదేవతాయైనమః

శ్రీ

పాండవజననము

శ్రీతిరుపతి వేంకటేశ్వరులచే

రచింపఁబడినది

ఆరవ కూర్పు 1000 ప్రతులు

ప్రకాశకులు:
వేంకటేశ్వర పబ్లికేషన్సు
కడియం P.O.
తూ. గో. జిల్లా.
1972

[వెల రు 2-25

ఇందువచ్చు పాత్రములు

1 వ అంకము

1_సూత్రధారుడు
2_నటి
3_పరాశరుడు
4_దాశుడు
5_మత్స్యగంధి

2 వ అంకము

1_శంతనుడు
2_భీష్ముడు
3_దాశుడు

3 వ అంకము

1_ఋషిబాలురు
2_భీష్ముడు
3_పరశురాముడు
4_అంబ
5_గంగ
6_నారదుడు
7_జమదగ్ని

4 వ అంకము

1_వ్యాసులు
2_సత్యవతి
3_భీష్ముడు

5 వ అంకము

1_సూర్యుడు
2_కుంతి
3_చెలికత్తె

6 వ అంకము

1_పాండురాజు
1_కిందవుడు
3_మృగయుడు
4. కుంతి
5_మాద్రి
6_భటుడు

7 వ అంకము

1_సిద్ధాంతి
2_ధృతరాష్ట్రుడు
3_భీష్ముడు
4_విదురుడు
5_ప్రతీహారి
6_కొందఱు ఋషులు
7_కుంతి
8_పంచపాండవులు

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

పాండవ జననము

ప్రథమాంకము

[నాంది]

మ. కరమున్ స్వచ్ఛమొకండు వేతొకఁడు రక్షశ్చక్రస హారి భీ
కర మింకొక్కఁడు శత్రువర్గమునకున్, గాండావళీశిక్షకున్
గురు వాక్కుం డరికంఠలుంఠనవిధిన్ గ్రూరం బొకం డిట్టి శ్రీ
హరిపంచాయుధముల్ గడంగి జగదాహ్లాదంబుఁ గావించుతన్.

[నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును]

సూత్ర-(తెరవంకఁ జూచి) ఆర్యురాలా! సభ్యులు నాటకారంభమున కెదురుచూచుచున్నట్లు కొన్ని సూచనల వలనఁ దెలియవచ్చుచున్నను, ఇంకను దెర బయలుదేఱవేమి?

నటి - (ప్రవేశించి) ఆర్యపుత్రా! ప్రకృతోచిత సామాగ్రీ సంపాదన పరాయణత్వమున నింతవరకు నాలస్య మొనరించినందులకు మన్నింపుఁడు. కర్తవ్య మాజ్ఞాపింతురుగాక.

సూత్ర-కర్తవ్యమున కేమున్నది? అటు చూడుము.

తే. గీ. సభయె గా దది సంద్ర మో సరసిజాక్షి!
అందు మన నాటకం బను యానపాత్ర
మిపుడు చరియింపవలెఁ గదా! యింపు గదురఁ
గర్ణధారివిగా నుండి కడపు మీవు.

నటి - (తనలో)మత్స్యగంధిని గమ్మందురు కాఁబోలును. (ప్రకాశము) ఆర్యా! నేను గడపుట యెందులకు? తామే సర్వమును నిర్వహింపఁ గలరు.

సూత్ర-(గౌరవముతో) ప్రేయసీ!

ఆ. వె. పేరు పూరుషులకుఁ దారసించునె కాని
కార్యనిర్వహణము కామినులది
వెన్నెలయె జగంబు వెలయింపవలెఁ గాని
చంద్రుఁ డేమిచేయు? జలజనయన!

నటి - చక్కని దృష్టాంతమును జూపితిరి. పరస్పర సాహాయ్యమువలన సర్వకార్యములును నెఱవేఱు నని తేలినది.

సూత్ర-ఇదియును ననుభూతమేకాని యనేక మహాకార్యములు స్త్రీల వలననే నెఱవేఱునవియును గలవు.

క. కుల మడఁగిపోవు పదఁపడి
నిలిపెఁగదా! యొక్కసాధ్వి. నేఁడో రేపో
పొలియున్ వంశం బనుతఱి
వెలయించెం గాదె? యొక వివేకిని మరలన్.

కావున నెంతటి నిర్వాహకురాండ్రేని స్త్రీలయందుఁ గలరనుటకు సంశయములేదు.

నటి - (తనలో) ఆర్యుని యుపన్యాసము సత్యవతినిఁ గుంతిని స్మరణకుఁ దెచ్చుచున్నది. (ప్రకాశము) కేవలబ్రహ్మచారులుగా నుండి యనేక మహాకార్యము లొనర్చిన పురుషసింహులు మాత్రము లేరా!

సూత్ర-లేకేమి?

తే. గీ. తండ్రిపెండిలికై పెండ్లి తాను మాని
కేవలబ్రహ్మచారియై కీర్తి కెక్కి
బలిమిమై స్వయంవరమున గెలిచి తెచ్చి
తమ్మునకుఁ బెండ్లి సేయఁడే! ధన్యుఁడొకఁడు.

నటి - (తనలో) ఈయన సురాసురజేగీయమాన పరాక్రముండగు భీష్ముండు (ప్రకాశము) నాథా! మన మీ ప్రసంగములోఁ బ్రకృతమునే మఱచుచున్నారము. నేఁడు ప్రదర్శింపఁదగు నాటక మెయ్యది?

సూత్ర-(నవ్వి) వెఱ్ఱిదానా! అయ్యది నాందిలోనే సూచింపఁబడెఁగదా!

నటి - (యోజించి) పాండవజననము కాదుగదా!
సూత్ర-(సంతోషముతో)

తే. గీ. అంత సులభమునుం గాక యంత దుర్ల
భమ్మనుం గాక మధ్యమపణితినలరు
పద్యమునఁ గల్గు వ్యంగ్యంబు పయికిఁదీయ
నేర్చితివి నీదుభర్త వర్ణింపఁ దగఁడె?

[కౌఁగిలించుకొనఁబోవును]

నటి - (సిగ్గుతోఁదలవంచుకొని కొంచెము తొలఁగి) ఆర్యా! దీనికినిఁ గవులు తిరుపతి వేంకటేశ్వరులేనా?

సూత్ర-నీ కొక్కటే గుఱుతును జెప్పుచున్నాఁడను. భారతకథను దెలుఁగులో స్వతంత్రించి నాటకముగా రచించినవారేలేరు. ఒకవేళ నున్నను పాండవ పదచిహ్నితమగు నామముంచినవారు లేరు. ఉన్నను సుప్రసిద్ధులు లేరు.

క. పారాశర్యమునీంద్రుఁడు
భారతమును వ్రాసెఁ దెలుఁగుపఱచిరి కవితా
స్వారాజు లొక్క మూఁగురు
వీరిరువురు నాటకముగ వెలయించి రిలన్.

(తెరలో) ఎవరక్కడ? పుట్టనిబిడ్డకుఁ బేరు పెట్టుచున్నారు? పరిశుద్ధమగు పరాశర శబ్దమున కపత్యప్రత్యయ మనెడి కళంకమును గూర్చు సాహసము గూడనా?

సూత్ర-(విని) తీర్థయాత్రార్థమై బయలువెడలిన పరాశరమునీంద్రుని మాటలు వినవచ్చుచున్నవి. మన మీపాటికి నరుగుదము రమ్మి.

(నిష్క్రమింతురు.)

ప్రస్తావన.

[అంతఁ బరాశరుఁడు ప్రవేశించును]

పరా - (సంతోషముతోఁ దనలో) ఔరా! తీర్థయాత్రా మాహాత్మ్యము!

ఉ. ఎందఱు పెద్ద లెందఱు మునీశ్వరు లెందఱు పండితుల్ మహా
నంద మొసంగఁజాలెడి వనంబులు నేఱులుఁ గొండ లెన్ని వే
ర్వం దులఁదూగు పల్లెలను గ్రామములున్ బురముల్ మఱెన్నియో
చందము లన్నియున్ గనిన స్వాంతము శాంతము గాకయుండునే?
(సంతోషావేశముతో) నా జన్మ మెంత ధన్యమైనది?

శా. కాశీయాత్ర యొనర్చితిన్ మఱి ప్రయాగక్షేత్రముం జూచితిన్
శ్రీశైలేశు భజించితిన్ గొలిచితిన్ శేషాచలావాసు రా
మేశున్ మ్రొక్కితి సన్నుతించితిని నీలేలాధరాధ్యక్షు రం
గేశున్ గాంచితి మెట్టినాఁడ నిఁక నెన్నే దివ్యదేశంబులన్.
(పరిక్రమించి) ఎదుట నేదో యొకనది పొడకట్టుచున్నయది.

[కొంత నడచి]

ఉ. నేరెడుపండుచాయ నవనీరదమండలిభాతి నీలపుం
బేరువిధానఁ దుమ్మెదలపిండుగతిన్ గగనంబుపోల్కె నీ
నీరము పెన్నిగన్నిగల నించుచు నున్నది యింతనల్ల నౌ
నారము దేని కొప్పు? యమునానదియే యిది యెల్లభంగులన్.
ఓహో దీని రామణీయకము!

తే. గీ. నలుపయిన నేమి మిగుల నానంద మొసఁగు
సొబగు గల్గిన దీ నదీసుందరాంగి
ఇట్టి సొగసరి భార్యగా నేలుచున్న
గేస్తు రత్నాకరుఁడు కృతకృత్యతముఁడు.

(ఆకసమువంకఁ జూచి) అరుణగభస్తిబింబము చాలవఱకుఁబడమర దిరుగుచున్నది. కావున నే నింతలో నీ నదిం దాఁటి యవలియొడ్డున నేదేని యొక పవిత్రప్రదేశమున నీరేయి గడపి రేపిందుఁ గ్రుంకు లిడి విధివిహితకృత్యము లాచరించుకొని మఱియుం బోయెద. (దెసలు పరికించి) కర్ణధారుండు కాఁబోలును పుట్టెనుండి డిగి

యిట వచ్చుచున్నాఁడు. నన్నుం గూడ నవలియొడ్డు చేర్చిన పిదపఁ బొమ్మనియెద.

[అంత దాశుఁడు ప్రవేశించును]

దాశు - (తనలో) మరల నెవరో యొక జడదారి గాఁబోలును వచ్చుచున్నాఁడు. నేఁ డేమోకాని యెంతసేపటికిని నాకుఁ గూటికే తీరిక నదికాదు. ఎప్పటితిండి? పొద్దుపొడుపువేళఁ దిన్నతిండి. ఏమైనను కూడుగుడిచిన పదఁపడిఁగాని యీ యనను దాఁటింపఁ జాలను. (తలవంచికొని పోవుచుండును.)

పరా - (సమీపించి) ఏమోయి మరకాడా! న న్నావలికి దాఁటింతువుగాని రమ్ము.

దాశు - (తేఱిపాఱఁజూచి) అయ్యా! దండ మండి. దయచేసి యయ్యెడఁ గూర్చుండుండి. మాపిల్లదాని నంపించెదను. అదిమిమ్ముల నవల దింపి రాఁగలదు. నాకు సెలవొసంగుఁడు. కూటివేళ దాఁటిపోవు చున్నది. (నిష్క్రమించును)

పరా - (తనలో) ఓహో! యేమి వీనియోగ్యత? నా ప్రయాణమున కభ్యంతరము లేకుండఁ దన కొమిరె నంపనెంచినాఁడు. కానిమ్ము. ఇంతలో నీ యేటియొడ్డునంగల వృక్షరాజముల సొబగుం దిల కింతుఁగాక. (పరికించి)

సీ. కొమ్మలు దిగవంచి గొడుగుల చందాన
సేవించుచున్నట్టి చెట్లు గొన్ని
జలజలమనఁగఁ బుష్పముల నెల్లెడరాల్చి
కై సేయుచున్న వృక్షములు గొన్ని
పాఱుటాకులను గుప్పలు తెప్పలుగ నించి
ఛాదించుచున్న భూజములు గొన్ని
కడుబెడం గడరు పుప్పొడులచే నొడలెల్ల
మెఱయించుచున్నట్టి తరులు గొన్ని

తే. గీ. అరమరయొకించుకయు లేక యంతరమునఁ
బ్రీతి ఫలించు మహీజసంతతులు గొన్ని
కలిగి యీనది కనువారి కన్నుఁగవకుఁ
బండువు నొనర్చుఁ దనదు సంపత్తి కలిమి.

[మత్స్యగంధి పుట్టితోఁ బ్రవేశించును.]

మత్స్య-అయ్యా! యీ పుట్టిలో నెక్కుఁడు. మిమ్మావల దింపి వచ్చెదను.

పరా - (పరికించి ఆశ్చర్యముతో తనలో) ఔరా! యీ జాలరికొలమ్మున కెంత యదృష్టకాలము వచ్చినది! ఏమీ యీ బ్రహ్మదేవుని యవివేకము?

ఉ. జవ్వనముఁ విలాసమును జక్కఁదనంబును మేల్మిచెక్కులున్
మవ్వపుఁగన్నులుఁ మురువుమాటలు కుల్కుపిసాళి గుబ్బలున్
నవ్వులతేటలున్ సొలపునన్ దగు మేటివిలాసపున్నడల్
నివ్వటిలంగఁజేసియును నీచపుజన్మము సంఘటించునే?

సీ. మృగశాబములకు నేర్పెడినేర్పు గలచూపు
సోయగం బొలుకు కందోయితళుకు
కుంభికుంభములయుక్కును ద్రొక్కి నిక్కి నీ
లైడి గుబ్బచన్గవలేబెడంగు
మాటిమాటికి ముద్దు మూటగట్టఁగఁ జాలు
మురువున మెఱయు నెమ్మోముహరువు
మిసమిసల్ నించు క్రొమ్మించుసంచు నడంచు
మెఱుఁగారు నెమ్మేని మెలపుసొలపుఁ

తే. గీ. గనినచో నెట్టి జడదారి కన్నుఁగవయు
రిచ్చపడు నట్టి యీమోవి మెచ్చులాఁడి
యచ్చరకుఁ బుట్టు వందక యక్కటకట!
మచ్చములఁ బుట్టు నెడ్డె కేమాడ్కిఁ బుట్టె?

(ధ్యానించుట నటించును.)

మత్స్య-(తనలో) ఈ యనఘుఁ డేమో యోజించుచు నా మాట విని పించుకొన్నట్లే లేదు. "తౌరలో నమ్మునివరు నవలి కనిపిర" మ్మని తండ్రి నా కానతిచ్చెగదా! తడవుచేసితినేని జనకు నాజ్ఞ ననాదరించిన దాన నగుదును. కావున నమ్మహాసీయు నిఁక నొక పరి వేగిరించెద. (ప్రకాశము) స్వామీ! తడయక దయసే యుఁడు. మిమ్మవల దింపి నేను వెనువెంటన యిటకు రావలయు.

పరా - (తనలో) ఔరా! యీ మాటల పొందిక! ఇట్టి పలుకులతో నీ కన్నియ యెవరి నేమి కోరినను వృథా పోదు. (ప్రకాశము) ఇదిగో వచ్చుచున్నాఁడను. (పుట్టెనెక్కి మరలధ్యానించుచుండును.)

మత్స్య-(పుట్టెను తెడ్డుతో నడుపును)

పరా - (తనలో) ఇప్పటికిఁ దేలినది. ఈ సుందరి వసువీర్యసంభవ. ఈపె తల్లి నిక్కముగా నచ్చరయే కాని శాపవశమున మత్స్యమై యీ బాలను గడుపున ధరించియున్న కాలమున నీ దాశరాజు భృత్యులకుఁ జిక్కినది. వా రా చేఁప యందమున కచ్చెరువంది తమ రాజునకుఁ గానుక వెట్టిరి. పదఁపడి యద్దాని గర్భమ్మున నిక్కన్నియయు నిఁక నొక బాలకుండును జన్మించిరి. ఈపె సర్వథా మాన్యురాలుగాని కేవల నీచురాలుగాదు. (యోజించి)ఏమో నామన మిత్తరలాక్షిం దగిలి మరలకున్నయది. ఇందుపాయ మేమి? (పరికించి) ఈపె నా వంక కేనియుం జూడక పుట్టె నడిపించుచున్నది. కొంచెము పలుకరించి చూతునా? (సంశ యించి) మాటలాడదేమో? (ధైర్యముతో) ఆడనిచో బలాత్క రించి యేని కృతకృత్యుఁడ నయ్యెద. ఇట్టి రహస్యసమయమున న న్నెవ రేమి సేయుదురు? (యోజించి) ఎట్టి గోప్యకృతులనైనఁ బంచభూతములును సూర్యచంద్రులును బరమాత్మయును జూచు చుందురుగదా? ఇదిగాక నేఁ జింతించిన పని యోగ్యుల కుచి తమా? ఔచిత్యము మాటట్టులుండ బలాత్కరించుట యెంత నీచ కృత్యము? (ఆలోచించి) అయినచోఁ గర్తవ్య మేమి? (నిశ్చ

యముగా) మాటలాడించి యిక్కన్నియ యనుగ్రహముం బడ యుటకన్న వేఱొంకుపాయములేదు. (ప్రకాశము) లతాంగీ! నీ పేరేమి?

మత్స్య-మత్స్యగంధి.

పరా - (ఆఘ్రాణించుట నటించి) ఓహో! యీ మత్స్యగంధ మీపె శరీరమునుండియే వచ్చుచున్నదేమి! పాపము! ఈ వాసన యీ చక్కఁదనమున కెంత లోపముగా నున్నది? [వెనుక చూచి] అప్పుడే యేటి నట్టనడిమికి వచ్చితిమి. ఇఁక నిక్కమలాక్షిని బ్రకృతోచిత పరిసంగములోనికిం దింపిన నేమి యగును? [యోజించి]

తే. గీ. ఈ యబల నిత్తలోదరి నీ మనోజ్ఞ
నీ లతాతన్వి నీ బాల నీ మృగాక్షి
మొదల నొకపరి స్పృశియించి పిదపఁ గాని
యే పరిసంగమ్మునకుఁ గూడ నేను జాల.

[చేయి పట్టుకొనఁబోవును]

మత్స్య-(తొలఁగి తనలో) ఏమీ? యీ మహాత్ముఁ డిటు లొనర్చుచున్నాఁడు? ఔరా! పరమవిరక్తుండయ్యును నిట్టి పనికిఁ బూనినాఁడే! కానిమ్ము. నేర్పున మరలింపవలెఁగాని మఱియొక్క చొప్పేని ముప్పు రావచ్చును. మునులు శాపాయుధులుగదా! అందులో నీయన "వసిష్టుని మనుమఁ డని" కూడఁ దండ్రి నాకు వాక్రుచ్చియున్నాఁడు. [ప్రకాశము] దేవరా! మన మిరువురమును నొకచో బ్రక్క నుంటిమేని యీ పుట్టె యీ నట్టేట మునిఁగిపోవును. కావున మీ రావలివైపునకుం జనుఁడు.

పరా - (మున్నున్నచోటికి వచ్చి తనలో) ఇఁక నీ లతాంగి నాకుఁ దక్కనదియే. లేనిచో నేమేని విరసత్వమును సూచింపదా? అవ్వలి యొడ్డు చేరిన పిమ్మటఁ దప్పక నా మనోరథమ్ము సఫలము చేయును. కాని యంత దనుక నే నోపు టెట్లు? [యోజించి] ఈమె తియ్యని పల్కులు కొన్ని వినుచుఁ గాలయాపనం బొన

రించుకొందుగాక! (ప్రకాశము) ప్రియభాషిణీ! పుట్టె నట్టేట మునింగిపోవుననియా భయపెట్టెదవు? మునుఁగ కుండఁగనే నీవు కడపఁగలవు. ఒకవేళ నీ వన్నట్టే మునుఁగుఁగాక.

ఉ. ఈఁదఁగ నేర్తువే కద శుభేక్షణ నీవు, త్వదాశ్రితు న్ననున్
గాదన కెట్టులేని యొక గట్టునఁ బెట్టకపోదువే? చెలీ!
నీదయకల్మి నేను నొక నీరనిధిన్ దరియింపనుంటి నిం
దీఁదఁగలేకపోదునె? యిదెంత? భవత్కుచకుంభ సంభృతిన్.

మత్స్య-(తనలో) సర్వవిధముల నిమ్మహనీయుని చిత్తము నా యందుఁ జిక్కినయది. వలదందునా? శపించును. లేదేని కన్యకాత్వము నకు భంగము కల్గును. ఇందేమిగతి? (పరికించి) ఒడు సమీపమునకు వచ్చితిమి. మరల నీయన నా యున్నచోటికి వచ్చు చున్నాఁడు. ఆహా! కామాంధకార మెంత యవివేకమును బుట్టించుచున్నది? (ప్రకాశము) స్వామీ! యొకించుక తాళుఁడు. పుట్టె మునుఁగవచ్చు.

పరా -(చేయిపట్టుకొని) ఈ పుట్టెతో నిఁక మన కేమి యవసరము? నన్నీమహా మోహసముద్ర ముత్తరింపఁజేయుటకు నీవే యొక పుట్టె వగుము. తడయకుము. (అని బతిమాలుచు, జుబుకము పట్టికొనఁబోవును.)

మత్స్య-(తొలఁగి) స్వామీ! తమవంటివారి యాజ్ఞను నే నన నెంత? ఎవ్వరైనను లోబడియే తీరవలయును. అయినను తప్పుగాఁ జూడక నా మనవి కొంచెము చిత్తగింపుఁడు.

ఉ. నీవు వసిష్ఠు మన్మఁడవు నేనొక జాలరివాని కూఁతురన్
భావమునందుఁ జూడు మిది భావ్యముగా దిటుచేసినన్ గులం
బా వెలిచెందు, మౌనివరులా హసియింతురి, తపంబు నష్టమై
పోవు భవాదృశుల్ వెడఁగుఁబోకలకుం దగువారలౌదురే?

క. తపమునకును వంశంబున
కుపద్రవము సంభవించు నూహింపక యి

ట్టిపనికిఁ జొరఁబడ నగునే?
తపసుల కెందేని యిట్టి తగులము లున్నే -

పరా - (మరలఁజేయిపట్టుకొని) సుగుణఖనీ! "స్త్రీరత్నం దుష్కులాదపి" కావున నీ వేకొలముదానవైనను దప్పులేదు. ఇదిగాక నీ జన్మమును గూర్చి నీ కెఱుకలేదు గాని నాకుఁ బూర్ణముగాఁ దెలిసినది. నీవు బ్రాహ్మణ క్షత్రియ జాతులకుఁ దగినదానవు. ఇది నిశ్చయము. ఇఁక జాగొనరింపక నన్ను మన్నింపుము. (ఆలింగనముఁ జేసికొన బోవును.)

మత్స్య-(తొలఁగి తనలో) వీరు దివ్యజ్ఞాన సంపన్నులు. వీరి కేదేని గోచరమగును. ఏమో? నాజన్మమెట్టిదియో? వీరికిఁ దెలియును గాఁబోలు. ఏమైనను నాకుఁదండ్రియనుమతి లేనిపని యనుచితముగదా! (ప్రకాశము)

ఉ. చేఁపలకంపుచే నెగడి చెప్పఁగరాని యసహ్యభావముఁ
జూపెడి నా శరీరమును జూచి వరింపఁగ నిచ్చగించె దీ
వోపిక మాని, దీన సుఖమున్నదొ? లేదో? గ్రహింప వయ్యయో
పాపపుమారుబారిఁ బడి పండితభావము రిత్తపుత్తురే!

మ. అనఘా! మానవజన్మ మెత్తుట యసాధ్యం బగ్రజత్వమ్మగై
కొనుటన్నన్ గడు దుర్లభం బదియు నీకుం జేకుఱెన్ మీఁదగా
సిని లెక్కింపక మౌనివై తపమువాసిన్ జెంచి పెంపొందు నీ
వనిమిత్తమ్ముగ మారుబారిఁ బడి నన్నాసింపఁగాఁ జెల్లునే?

పరా - నాకుఁ దపమును జపమును బుణ్యమును బూరుషార్థమును నీవే. నీ కంపు నా కింపగునప్పు డావిషయమై నా కెందుకు విరక్తి గలిగించెదవు? (యోజించి) పోనిమ్ము పాపము. నీ కీ కంపు మనమ్మున నేవంబు గలిగించుచున్నది కాఁబోలును సుందరీ?

క. మీనపు గంధము నీ నె
మ్మేనిన్ దృజియించుఁగాత మిక్కుటముగ నా

యానతి నిది మొదలుగ నీ
మేనస్ మృగమదపుఁదావి మేకొనుఁగాతఁ.

ఇఁక మాటాడక న న్నాదరింపుము. (మరలఁ జేయి పట్టుకొనును)

మత్స్య-(తన శరీరము నాఘ్రాణించుట నటించి) ఔరా! యీ మహాత్ముఁడు నా కెంతటి యుపకృతి నాచరించినాఁడు. ఇందుల కియ్యనఘుని కేమి ప్రత్యుపకారము చేయఁగలను? ఇట్లగుఁగాక. (ప్రకాశము)

ఉ. తుందుడు కింత చెల్లునె; బుధుండవుగావె? యెఱుంగవే? ధృతిన్
జెందుము చిత్తవృత్తి నిటు చిందరవందర చేయనేల? నా
యందము నీ మనమ్మునకు నందినదేని భవన్మనోరథ
మ్మొందగఁదీర్తు నొద్దునకుఁ బోవఁగని మ్ముదుపమ్ము నిమ్మగన్.

పరా -(పుట్టె దిగి యాపె కరమును బట్టికొని దింపబోవును)

మత్స్య-(దిగి పుట్టె నొక కొయ్యకుఁ గట్టి యొడ్డెక్కును)

పరా - (మదనావేశముతోఁ గౌఁగిలింపఁ బోవును)

మత్స్య-(తనలో) ఇఁక నెట్లయిన నియ్యనఘుఁడు నన్ను విడువఁడు. నా తప్పిదము దల్లిదండ్రు లెఱుఁగకుండ నెట్లు దాఁచికొననేర్తును. (ప్రకాశము)

తే. గీ. కన్నియను నేను నాతోఁడఁ గలయనుంటి
వోమహాత్మ! యమోఘవీర్యుఁడవు నీవు
తల్లిదండ్రుల కే సమాధానమును వ
చింపఁగా నేర్తు? ననఘాత్మ! చెప్పుమయ్య!

మ. తలిదండ్రుల్ తల లెత్తలేక కడు వంతం న్మగ్ని యెగ్గింతు ర
న్నలుఁదమ్ముల్ పెఱవారి మోములు గనన్ శంకించి లజ్జింత్రు నె
చ్చెలు లన్నఁ గడు గేలిసేయుదురు వాసిఁ బెండ్లిగాఁబోదు క
న్నెలకుఁ జారుఁడొనర్చు వేఁకటుల వెంతేఁ జింతఁగల్పింపవే?

పరా - తే. గీ. నీకు నా పొందుఁజేసి కన్నెఱికమునకు
హాని వాటిల్ల కుండెడు నది యటుండఁ

గోరుకొ మ్మిచ్చెదను నీవు గోరు వరము
లెన్నియేనియు నోశర్వరీశ వదన!

ఉ. అచ్చరమచ్చెకంటుల యొయ్యారము లారసి యూరకున్న నా
కిచ్చ జనించె నేఁడు తరళేక్షణ! దైవవశంబుఁ జేసి, నీ
మచ్చెపుఁ దావియేడ? నిను మన్ననఁజేసి వరించు టేడ? నా
సచ్చరితం బదేడ? తన శక్యమె? దైవకృతంబు దాఁటఁగన్.

మత్స్య-(సంతోషముతో) మహాత్మా! నేనేమి కోరినను నొసంగెద
మంటిరి. గాన గోరుకొనుచున్నదానను.

సీ. నిన్నుఁ బోలంగల్గు చిన్నారి పొన్నారి
చిఱుతపాపని దయచేయు టొకటి
కన్యాత్వమున కించుకయు నిందు నందు లో
పమ్ము లేకుండఁ గాపాడు టొకటి
తల్లిదండ్రుల కీ యుదంత మించుకయును
దెలియకుండంగ సంధించు టొకటి
యక్షయంబగునట్టి యౌవనం బేవేళ
మించురీతిని గటాక్షించు టొకటి

తే. గీ. మీన గంధమ్ము వాసి నా మేని కిప్పు
డీ వొసంగిన కస్తురి తావి చేవ
చెడక వాసించు పద్ధతి చేయు టొకటి
నాకు దయచేసి యామీఁద నన్నుఁగొనుము.

గీ. నీకుఁ బ్రతిచెప్పఁ గానోప నీ వెఱుంగ
నట్టి ధర్మంబుకలదె? కామాతురత్వ
మింతగా నీ మనము నలయించెఁగాక
పట్టపగ లిట్టి కృతిసేయఁ బాఁడి యగునె?

పరా - సుందరీ! నీ కోరిన కోరికలెల్ల నమోఘములై ఫలించుఁగాక మఱి
యు నొక్క విశేషమ్ము వినుము.

మ. నిగమమ్ముల్ విడఁదీయువాఁడు సొబగు న్నేర్పు౯ దయాశత్వముం
 డగువాఁ డుత్తముఁ డూర్జితాత్ముఁడు పురాణంబుల్ వెలిన్ జేసి యీ
 జగతిన్ బేరును గాంచువాఁడు పరవిద్యాచతుర్యధుర్యుండు నా
 దు గుణమ్ముల్ గలవాఁడు నీ కొక సుపుత్రుం డుద్భవించుం జెలీ!
 [ముద్దిడుకొనఁబోవును]

మత్స్య-[తొలఁగి] మునీంద్రా! సర్వజ్ఞుండవగు నీకొకరు బోధింప వలసినది లేశమును లేదు.

తే. గీ. "దాశపుత్రికతోడఁ బరాశరుండు
 బట్టపగలు నదీతటీ భాగమందుఁ
 దగులు సేసె" నటంచు వింతగ జనమ్ము
 లాడికొను మాటలు సహింపనగునె? చెపుమ.

అదియునుం గాక.

తే. గీ. కాలనియమము పశుల సాంగత్యమున క
 నవసరముగాని మనుజుల కట్లుగాదు
 కాన నా మాట విని రాత్రికాల మబ్బు
 దనుకఁ దాళుము పాపకృత్యం బిదేల?

తే. గీ. అరయుచున్నాఁడు నా తండ్రి యవలి యొడ్డు
 నందు, మార్గస్థు లెవరేని యరుసుదేర
 వచ్చు నేమైన నిటు పశువై ఖరినిఁ జ
 రింపుటకు నా మనము సమ్మతింప దనఘ!

పరా - తలోదరీ! ఇప్పట్లు నీవు బోధించిన తెఱంగు గడు రమణీయము. ఇదిగో చూడుము. సర్వదృష్టినిరోధకం బగుమంచుం గల్పించుచున్నాఁడను. ఇంక నీ సందియము దొలఁగెనుగదా?

మత్స్య-(ఆశ్చర్యముతో) ఔరా! ఈ మహానుభావుని తపోమహిమ! ఏది గోరిన నదియె సంఘటించుచున్నాఁడు! ఇట్టి పరమపావనుని తను సంపర్కమున కెంతటి పుణ్యము చేసికొంటినో. (తలవంచి నిలువంబడును.)

పరా - (మోమునెత్తి) లజ్జావతీ ! అపొదరింటిం జూడుము.

క. తుమ్మెద లెల్లెడ ఝుంకా
రమ్ములు పొనరించుచుండె రాచిలుకల మొ
త్తమ్ములుఁ బికములుఁ గేకులు
సమ్మద మొనరించుఁ గామిజనమిత్రములై.

చెలీ ! నీకు నేఁడు కడు సుదినము.

క. సద్యోగర్భమ్మున సూ
ర్యద్యుతితో నీకుఁ గొమరుఁడై పుట్టుఁజుమీ
యాద్యుఁడు నారాయణుఁ డా
విద్యానిధి కతన జగము వెలయున్ జెలియా !

సంశయింపకుము ఈరహస్యమ్ము దుర్భేద్యమై యుండు. కొలఁది కాలముననే నీకు నొక యుత్తమ వంశసంభవుం డగు భూపాలుండు పతికాఁగలడు.

ఉ. భారతకర్తయై కొడు కపారయశమ్మును గాంచు నీవునున్
భారత వంశము న్నిలిపి పావనకీర్తి వహింతు వూరకే
ధీరత గోలుపోయి వెలితిం బడు నొక్కొ ? పరాశరుండు ; సం
సారసుఖమ్ములన్ మరగు జాల్ములొకో ? యనఘుల్ ఋషీశ్వరుల్.

రమ్మ జాగుసేయకుము. (నిష్క్రమింతురు.)

గద్య.

ఇద శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁబడిన
పాండవ జననమ్మునఁ బ్రథమాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

పాండవజననము

ద్వితీయాంకము

[అంత విరహావస్థతో శయనస్థుఁడై శంతనుఁడు ప్రవేశించును.]

శంత- (నిట్టూర్పు పుచ్చి)

ఉ. వేఁటకు నెందు కేగితి ? వివేకము నేటికిఁ గోలుపోయి యా
బోటిని గోరితిన్ సరియపో ! యది సమ్మతిఁ జూపనేల ? య
య్యాటవికుండు దానిపిత యందుల కడ్డు వచింప నేల ? యా
హాటకగాత్రి కూటమి కటా ! యెటు లబ్బెడి నేది దిక్కుఁకన్.

కొలఁదిదినమ్ముల క్రిందటనే కదా నా ప్రియురాలు జాహ్నవి కొమరుని నాకు నప్పగించి "వీఁడు సర్వవిద్యలయందును విద్వాంసుఁడయ్యెనిఁక వీనికి యౌవరాజ్యపదము నొసంగు" మని చెప్పి యంతర్హితయయ్యె. దాశరాజు తన దౌహిత్రునకు రాజ్య మీయవలయుననియు లేనిచోఁ గొమిఁరెనీయ ననియు నిష్కర్షగాఁ జెప్పినాఁడు. అందులకే యొప్పుకొంటినేని —

మ. "కొమరుం డుండఁగఁ బెండ్లియాడు నవివేకుం" డంచునే కాక పు
త్రు మహీరాజ్యభరంబు పూనుపఁడహో ! దుష్టుండు వీఁడంచు లో
కము నిందించు నశించు ధర్మము యశఃకాముల్ మహీపాలు ర
క్రముఁ డీతండని గేలిసేసి కడు ధిక్కారింతు రెక్కాలమున్.

ఎట్లయినను అ త్తలోదరినిఁ గొనికాని జీవింపఁజాలను. (మెచ్చుతో)

ఉ. ఆ యలరారు చూపులయొయారము నాగమనంపు సొరు నా
ప్రాయము తీరు నామురువు పల్కుల సొంపును నాయురోజ సు

శ్రీయు నటుంత మేరికిని జెప్పను గిప్పఁదరంబుగాని వ
క్ర్యాయజ రాజ్యలక్ష్మి నవకాయపరీమళ భాగ్యసంపదల్.

తలోదరీ : నీవు నిజముగా యోజనగంధివే యగుదువు. నీ రూప రేఖావిలాసమ్ము లింతకుమున్ను విన్నందులకును బిదపఁ గన్నందుకును సరిపోయినది. అయిననేమి ? నీ తండ్రి కేవలమూర్ఖుఁడై వెఱ్ఱి పట్టుపట్టి "తాఁబట్టిన కుందేటికి మూఁడే కా" ళ్ళను చున్నాఁడు. పోనీ నే నీ మహామోహమ్మునం బడి యటేయని యొప్పుకొన్నను, నా కొమరుండు గాంగేయుం డేగతి సమ్మతించు ? వాని సమ్మతి లేనిచో సాక్షాద్భగవంతుఁడేని నా రాజ్యమ్మున నడుగు పెట్టఁగలుగునా ?

ఉ. పౌరవవంశవర్ధనుఁడు బాహుపరాక్రమధూర్వహుఁడు దు
ర్వారుఁడు జామదగ్న్యమునివర్యుని శిష్యుఁడు జహ్నుకన్యకా
దారకుఁ డ వ్వసిష్ఠముని తల్లజు సత్కృప నెల్లవేదముల్
పారము ముట్టినాఁడు గుణభవ్యుఁడు నా కొమరుం డలంతియే ?

శా. ఈ రాజ్యంబఖిలంబు వానిది యొకండీనేల ? యే నేల నే
నీ రాజుల్ విని సమ్మతింతురె ? వృథా యే నన్యథా చేసినన్
సారజ్ఞుల్ విని మెచ్చుకోని పనికై చర్చింపఁగా నేల ? దు
ష్ప్రారంభుం డితఁ డంచు నిందఁబడనేలా ? నాకు లోకమ్మునన్.

(నిట్టూర్పుపుచ్చి తన్మయత్వముతో) ప్రేయసీ ! యోజనగంధీ ! నీ పాణిగ్రహణము నాకుఁ బ్రాప్తిలేదు. నే నేమిసేయుదును ? అస్వతంత్రుఁడను.

చ. కొమరులకున్ వివాహములు కోరి యొనర్తురు తల్లిదండ్రు ల
క్రమ మిటఁ దారసించె మన కర్జము పుత్రునధీన మయ్యె వాఁ
డమలుఁడు వానికిం దెలిసెనా ? వెనుదీయఁడు వానితోడ నే
క్రమమునఁ జెప్పనేరుదు ? మొగం బెటు లెత్తుకొనంగఁ జాలుదున్.

ఇందుపాయ మేదియును దోఁచదు. (విచారించుచుండును.)

[అంత భీష్ముఁడు ప్రవేశించును.]

భీష్మ-(తనలో) తండ్రిగా రేలాకో వేఁటకు వెళ్ళి వచ్చినది మొదలు

పరాయత్త చిత్తులై రాజకార్యములయం దనాదరము గలిగి శయన గృహమ్మునన కాలయాపనం బొనరించుచున్నారఁట! "కారణమే" మని మంత్రులడిగియును కృతార్థులు కారైరఁట! దేహమం దస్వాస్థ్యమేమో యనఁకొందమన్న నయ్యది లేశమును గానరాదఁట! ఇఁక నేమి కారణమో కదా? (యోజించి) ఏమేని యగుఁగాక. ఆయన కోరికం దీర్పకపోతినేని నేను బుత్రుఁడ నెట్లగుదును?

తే. గీ. బ్రతికి యున్నప్డు మాటను బాటి చేసి
మృతి గనిన పిమ్మటను దగుకృతు లొనర్చి
యెవఁడు తండ్రికి సమ్మోద మెసఁగఁజేయు
వాఁడె పుత్రుండు సఫలంబు వాని బ్రతుకు.

క. "శ్రీరాముఁ డొక్కరుండును
బూరుం డొక్కరుఁడు దక్కఁ బుత్రులలోనన్
లేరు జనకు నాజ్ఞను గర
మారాధించిన వినీతు" లందురు పెద్దల్.

కావుననే వారి నిప్పటికిని గౌరవ ప్రశంసా పాత్రులలో నగ్రగణ్యులుగాఁ జెప్పికొనుచున్నారు.

క. వ్రతములుఁ దపములు జపములు
పితృసేవకు లొచ్చు తనదు పెంపున కెల్లన్
గతి తండ్రియె కావుననే
"పితృదేవోభవ" యటంచు వేదము పలుకున్.

(పరికించి) తండ్రిగారేదియో యోజించుచున్నారు. (సమీపించి నమస్కరించును.)

శంత- (కౌఁగిలించుకొని) కుమారా! ఆయెడఁ గూర్చుండుము.

భీష్మ- (కూర్చుండి) తండ్రీ! "మీ రేదియో తీరరాని విచారము మనమున నిడికొని కుందుచున్నా" రని మన మంత్రులు మొదలగువారు చెప్పికొనుచున్నారు. తమకును దుర్లభములగు కోరికెలు కలుగునా? అట్లయినచో నిఁక జగమ్మునఁ గృతార్థు లెవ్వరు?

చ. అనుపమమైన రాజ్యము, మహాత్ములు మంత్రులు, శత్రురాజ మ
ర్దనమగు తేజమున్, ధన మదభ్రము, సౌఖ్యము కొల్ల, నందనుం
డనిమిషవాహినీప్రభవుఁ డన్నిఁట నున్నతి గాంచి మించి వా
రని వలవంత లోఁగొని కరంబు భరంబుగఁ గుందనేటికిన్.

శంత- (తనలో) నాకుఁగల యీ కోరికె నీతనితో నేమని చెప్పుదును ?
చీ! కామ మెంత గర్హ్యము! అందునను.

చ. కొమరులు గూఁతులుం గలిగి కొండొక ప్రాయమువోయి యప్పుడున్
దమి నిలుపంగఁజాలక వృధావ్యసనంబు మనంబు నొంపఁబా
రము నెఱుఁగంగనేరక దురంతపుఁబెండిలిగోరుఁ బో! లులా
యమువలె మంచిచెడ్డలకు నాత్మను జొన్పని మూఢుఁ డక్కటా!

యాథార్థ్య మెఱిఁగియును నే నమ్మగువకు లోనైతి. అయిన నగు
దుంగాక! కొమరునితోఁ గూడ నేమని చెప్పువాఁడను! (యోజించి)
ఇట్లగుఁగాక (ప్రకాశము) కుమారా! సకలగుణశాలి యగు నీ వంటి
కొమరుఁ డున్నవానికి విచార మననేమి? దుర్లభ మన నెట్టిది?

క. ఎనమండ్రఁ గనియెఁ గొమరుల
ననిమిషనది నీదు తల్లి, యందఱలో ని
న్నును మాత్రము నా కిచ్చెను
దనలోనే కలిపికొనియెఁ దక్కిన సుతులన్.

నిన్నుఁగూడ యథాపూర్వముగఁ దనలోనే చేర్చుకొన నుంకించుచుండ నేను సహింపక ప్రతిజ్ఞాభంగమ్మున కంగీకరించి వారించితి నంతట నాపె నాపైఁ గనలి తన యిచ్చం బోవుచు దీనవదనుండనగు నన్నుం జూచి "రాజా! విచారింపకుము. నే నేదో యొక శాపకారణమున నీకు భార్యనైతి. వసువులును నావలెనే శాపకారణమున మనుష్యులు కావలసియుండి నన్నుఁ బ్రార్థించుటచే నందుల కంగీకరించి యీ దురితం బొనర్చుచుంటి. ఇపుడు నీచే వారింపఁబడి మొదటి ప్రతిజ్ఞ దప్పితివను నెపమున నేను బోవుచుంటి" నని చెప్పి నిన్నుం

దీసికొని చని విద్యాబుద్ధులం జెప్పించి సత్యవాదిని గావున నప్పరమ పావని తిరిగియు నా కప్పఁజెప్పె. అయిననేమి ?

క. ఒకకొడుకు కొడుకునుం గాఁ
దొకకన్నును గన్ను గాదయో ? పుత్రీ ! యిం
కొకఁడేని యధమపక్షం
బకటా ! యుండంగవలదె ? యాత్మజుఁ డనఘా !

ఇందులకై నా మనంబు కడు వ్యాకులపడుచున్నయది.

తే. గీ. దాశరా జను నొండొక్క ధన్యతముఁడు
గలఁడు వానికి నొక్కతె గలదు కూఁతు
రాపె నా కిచ్చుటకు నాతఁ డడ్డదిడ్డ
ములుగ నేమేమియో చెప్పె మొన్నఁ దనయ.

దానిపై నింటికి వచ్చి యేమియుఁ దోఁపక యిట్లుంటి.

భీష్మ- (తనలో) "అతఁడు చెప్పిన యభ్యంతర మే" మని తండ్రిని గోరుటకన్న నయ్యెడ కరిగి యతని వలననే వినుట కడు నుచితము గదా ! (ప్రకాశము) తండ్రీ ! ఇందుల కింత చింతయేల ? నే నిప్పుడ చని దాశరాజుం బ్రసన్నుఁ జేసికొని నీ కోర్కె నెఱవేర్తు. నా కాజ్ఞయొసఁగుము. (నిష్క్రమించును.)

శంత- (తనలో సంతోషముతో)

చ. కొమరుఁడ వన్న నీవె యిటు కోరిన కోర్కిక దీర్చ పుత్ర స
త్తములను వింటిమే ? యకట ! తప్పని యొప్పని నంత సందియం
బు మది నెఱుంగకే కడఁగి పూని మదీప్సితముం బొనర్చు నీ
కమరెడిఁగాక స్వేచ్ఛ కనువై తగు జీవిత మేవిత బునన్.

సర్వవిధముల నీ యుద్యమంబు సద్యశఃప్రద మగుఁగాక ! నీకు దాశుండు దాసుం డగుఁగాక !

[అంత దాశరాజు సహితముగా భీష్ముఁడు ప్రవేశించును.]

భీష్మ- (నమస్కరించి) తండ్రీ ! ఇదుగో దాశరాజు ! ఇయ్యనఘుండు తన పుత్రికను నాకుఁ దల్లిఁగాఁ జేయుట కంగీకరించెను.

శంత- (సంతోషముతో) కుమారా! ఎట్లంగీకరింపఁ జేసితివి? అతఁడు గోరిన విషమపుఁ గోరిక కేమి యుత్తరము నిచ్చితివి?

భీష్మ- ఈ విధముగా నుత్తరం బొసంగితిని.

శా. రాజ్యం బక్కఱ లేదు నాకు, సకలారాతి క్షమానాథ సా
మ్రాజ్యంబుల్ వెస గెల్చి తెచ్చెదను నీ మన్మండె యీ సర్వముం
బూజ్యుండై భరియింపఁగాఁగలఁడు సోముం డర్కుఁడున్ సాక్షి లే
నే జ్యేష్ఠత్వము వాని కిచ్చితిని నీ కింకేల? శంకల్ నృపా!

శంత- (తనలో) ఔరా! వీని సాహసము! (యోజించి) ఔను! అప్రయోజకులకుఁ గాని సుప్రయోజకులకు రాజ్యాదిక మందంత యాస్థ యుండదుకదా! (ప్రకాశము) తండ్రీ! నీ సాహసమునకు సంతసించితిని. నీవు స్వేచ్ఛాజీవివి గమ్ము.

దాశ- (సంశయముతో) గాంగేయా! ఇంతకు మున్ను నీ విట్లు చెప్పినప్పుడే నేను నిన్ని ప్రశ్న యడుగఁదలఁచి మీ తండ్రి సమక్షముననే యడుగవచ్చునని మిన్నకుంటిని. నీవు సర్వవిధముల రాజ్యమునకుఁ దగియుండి "రాజ్యమక్కఱలే" దనుట యంత భావ్యముగాదు. ఒకవేళ పితృభక్తి పరవశుండవై యట్లు ప్రతిజ్ఞ పట్టితివే. యనుకొందము,

క. నీ కొమరులో నీ మనుమలో
తాఁకుదురు వివాదమునకుఁ దమ రాజ్యంబున్
గైకొను తలఁపున, నిందుల
కేకరణిన్ బదులు చెప్పె? దెఱుఁగఁగ వలయున్.

నాకు మొదటినుండియు నీ విషయముననే సంశయము.

ఉ. సోమకులైకభూషణుఁడు సుందరుఁ డందఱకన్న మేటి మా
కోమలి ప్రేమకుం గుదురు కోరియె మే మొసఁగంగవచ్చు మీ
రే మముఁ గోరినప్పు డిఁక నేటికి సందియ? మిట్టి జేనికిన్
మామయటన్నఁ జాలదె? కుమార! యిదొక్కటి లేకపోయినన్.

భీష్మ - (నవ్వి) తాతా! మీ సందియ మింతమాత్రమే కదా? అటులైన నిది వినుఁడు.

ఉ. పెండిలియాడినన్ బిదప బిడ్డలు పుట్టుట గల్గునే నిదే
"పెండిలి మానుకొంటి" నని బిట్టు ప్రతిజ్ఞ యొనర్చితిన్ మహీ
మండలి బ్రహ్మచారినయి మన్ననకుం గుదురౌదుఁ గాక బ్రి
హ్మాండము మున్గిపోవునె? యహో! యొకఁడీగతి నుండిపోయినన్.

శంత - (తత్తఱపాటుతో) తండ్రీ! ఇట్టి దారుణ ప్రతిజ్ఞ నేలపూనెదవు? నా వివాహమున కేమి? మఱియొక విధముగాఁ గావచ్చును. లేదా? కాకిపోనిమ్ము. నీ యట్టి కొమరుఁడుండ నాకుఁ బెండిలి మాత్ర మెందులకు? ఒక్కచో సంతానముగూడ లేకుండుటయుం దటస్థించినను రెండవ పెండ్లి కూడదు. విచారించిన దీనియం దెన్ని నష్టములు గలవో పరికింపుము.

సీ. భార్యయుండఁగ నొండు భార్యఁగై కొనువారి
కస్తి కుక్కలకు నక్కలకు నెఱుక
సంతాన ముండియు "సతిలే" దనుచుఁ బెండ్లి
యాడు పెద్దలబుద్ధి యాఁడుబుద్ధి
ఉభయంబు లేదని యుపయమంబు వహించు
వృద్ధు దైవేచ్ఛకు నెదురువాఁడు
"వెనుకటిపెండ్లము వినదు మాట" యటంచుఁ
బెండ్లాడు వాఁడొక్క పెద్దమూర్ఖుఁ
తే. గీ. డెట్టులో కొంత జవ్వన మేగు పిదప
గ్రామ్యసుఖమునకై యొక కన్నెఁగోరు
వాఁడు హీనుఁడు తులువ యవ్వాఁడు దేబె
వాఁడు వీఁడె శంతనుఁ డిఁక లేఁ డొకండు.

ఇట్టి చపలునకై నీవు బ్రహ్మచారివి గావు టుచితమా! అది యునుంగాక.

క. మనమునఁ బంచేంద్రియములు
తనయా! కడుఁ జంచలములు, దారవిహీనున్
జెనకి యధోలోకమునకుఁ
బనుచున్ వాఁడెంత పెద్ద పండితుఁడేనిన్.

భీష్మ- తండ్రీ! నీవు చెప్పినది సత్యమేకావచ్చును. ఐనను,

మ. కురువంశమ్మునఁ బుట్టి నిస్తులయశఃకూలంకషుల్ సత్యసం
గరు లాశాంతధరేశ్వరుల్ చిరతపఃకంజోద్భవుల్ తాతలై
పరఁగన్ బెంపు వహించి శంతనుమహీపాలాత్మ జన్మండనై
తిరుగన్నే ర్తునె యన్నమాట కది కీర్తిం దెచ్చునే? నచ్చునే?
అదియునుంగాక

ఉ. గంగకుఁ బుట్టితిన్ నిఖిలకల్మషహారిణికిన్ మహానుభా
వుం గురుఁ గొల్చితిన్ బరశువున్ గయిఁ బూను మునీంద్రు, నిట్టి నే
నంగజుధాటి కోడి యొక యంగన దాస్యము సేయఁబూనుక
న్నంగుఱిగల్గి నిల్చి ప్రతినన్ నెఱవేర్చుట పెంపు నింపదే?

ఆ. వె. పుట్టుబ్రహ్మచారి పట్టినపట్టు నె
ప్పట్టునందు వీడనట్టిఘనుఁడు
భార్గవుండు నా కుపాధ్యాయుఁ డాతండు
సిగ్గువడఁడె? ప్రతిన చేసి తిరుగ.

శంత- కుమారా! అట్లు కాదు. ఏ యవస్థకుఁ దగినట్టు లప్పుడు సంచ
రింపవలయు.

ఉ. "ఆదిని బ్రహ్మచర్యము ననంతరమందు గృహస్థ ధర్మ మా
మీఁద వనప్రవాస మటుమీఁద యతిత్వ" మటంచు బ్రహ్మ వి
ద్యాదరు లండ్రుగాదె? తనయా! వినయమ్మగలాఁడ వాగమా
పాదితమైన ధర్మము నెపమ్మున వమ్మొనరింపఁ బాడియే.

భీష్మ- జనకా! ఆంజనేయాదులగు నస్ఖలిత బ్రహ్మచారులను వినమా?

శా. ఆయుర్దాయము హెచ్చు, వచ్చును యశం, బాశాపిశాచంబు ద
వ్వై పోయేగున్, దను కాంతి పెచ్చుపెరుఁగున్, హైన్యం బడంగున్, జెడున్

మాయాసంగతి, దేహదార్ఢ్య మెసఁగున్. మానం బవిచ్ఛిన్నమౌ,
నే యెగ్గుల్ 'నహి' బ్రహ్మచారులకు, నాత్మైక్యంబు గల్గున్ దుదిన్.

శంత- తండ్రీ! చక్కఁగా విచారించినచో గార్హస్థ్యమును సమస్త పురుషార్థ సాధకముఁగాని వేఱొండు తెఱఁగు గాదు.

మ. అతిథుల్ పూజితు లౌటచే శ్రితులయం దాసక్తి గైకొంటచే
సుతులన్ గాంచుటచేఁ గుమారికల నచ్చున్ భర్తతోఁగూర్చి పెం
డ్లి తగం జేయుటచే గృహస్థిహమునం దేజోధికుండై పయిన్
మృతుఁడై మోక్షపదంబు గైకొనెడిఁజుమ్మీ! దేవతా సేవ్యుఁడై.

భీష్మ- నిజమ్మనకు గార్హస్థ్య మట్టిదియే కావచ్చును. ఐనను ఎక్కడనో కాని యిందుఁ గృతార్థుఁడు చూపట్టఁడు.

మ. ధనమున్నన్ సతి లేక తత్సుఖము సందర్భించినన్ సంతతిన్
గన కాభాగ్యము గల్గ వేఱొకటి యక్కామ్యంబు చేకూఱ నిం
కను నొక్కండది గల్గ నొక్కఁడదియుం గల్గన్ మఱొక్కండు లే
దనుకో ల్దప్పదు తృప్తి యెక్కరణి లభ్యంబౌను సంసారికిన్?

శంత- (తనలో) ఓహో! వీని మనోనిశ్చయము కడు దుర్వారమై యున్నయది. చక్కఁగాఁ బరిశీలింప నిది యంతయు నాకు బుద్ధి చెప్పుట గాని వేఱొండుగాదు. కానిమ్ము. ఇట్లు గూడఁ జెప్పి చూచెదను. (ప్రకాశము) కుమారా! సర్వ విధములను "గార్హస్థ్యము నింద్య" మనికదా? నీవు సమర్థించుచుంటివి; అట్టియెడ నాకు మాత్ర మయ్యది సుఖకర మెట్లగును? నేనును జాలించికొనియెద. మన మిరువురమును నిట్లే యుందము. (దాశునిదిక్కైౕ) రాజా! నీ కొమిరెను నీ యిష్టము వచ్చిన వరున కిచ్చి వివాహం బొనరించుకొమ్ము నీవు కోరిన హిరణ్యాశ్వరమ్ములు మ మ్మింతవఱకుఁ దెచ్చినవి.

దాశు - (తనలో) ఓహో! తుద కీప్రశంస వంశచ్ఛేదమునకు సూచకమగుచున్నదే? కానిమ్ము. ఇందులకు గాంగేయుం డేమి యుత్తర మిచ్చునో వినియెదఁగాక!

భీష్మ- తండ్రీ! నేను బ్రహ్మచారిని. కావున నిట్లున్నచో నే లోపమును లేకుండెడిని. నీవోఽపరిష్కృత మేయాశ్రమమును లేక నిరాలంబుండవై యున్నాఁడవు. "అనాశ్రమీ నతిష్ఠేత" యని వృద్ధులు వచియింతురు. ఒకవేళ నీవిప్పుడు సన్యాసాశ్రమముఁ గైకొనెద నను కొన్న నది విరాగమ్ములేని నీ కుచితముగాదు. "విరక్తిలేని సన్యాసము ముక్తి నొడఁ గూర్చుటకు బదులు ముప్పు నొడఁ గూర్చు" నని యనేక గ్రంథములు సెప్పుచున్నవి. కావున.

ఉ. సత్యవతిన్ వరింపుము యశస్కరులన్ సుతులన్ భరింపు మే
సత్యమ పూనితిం బ్రితిన, సాగరముల్ స్థితి దప్పఁగాక యా
దిత్యుఁడు చంద్రతారకలు తేజము డింతురుగాక మేటి దౌ
ర్గత్యము గల్గుఁగాక తిరుగండిఁక నీ తనయుండు పూన్కికిన్.

[ఆకసమునుండి పుష్పవృష్టి గురియును.]

శంత- (ఆశ్చర్యపడి చూచుచుండును.)

దాశు- (అట్లే చూచుచుండును.)

భీష్మ-తండ్రీ! చూచితివికదా? ఇందులకు దేవతలు గూడఁ దమ యంగీకారమును బుష్పవృష్టి మూలమున సూచించుచున్నారు.

శంత- (సిగ్గుతో) కుమారా! ఈ పుష్పవృష్టి సత్యసంధుండ వగు నీ యోగ్యతను దెల్పుటకుఁగాని వృథాకాముకుండనగు నావివాహము ననుమతించుటకుఁ గాదు.

దాశు- రాజా! అట్లనుకొనకుము. ఇయ్యది నీ వివాహమునకుఁ గూడఁ బ్రేరకమే, ఏమంటివా? మా సత్యవతి దేవేంద్రసఖుఁడగు నుపరిచరవసుని పుత్రిక. ఆ వసురాజునకు నిన్నల్లునిఁగాఁ గైకొను తలంపు పూర్ణముగా నుండి యొక్కనాఁడు నా యొద్దకు వచ్చి సత్యవతి తన కూఁతు రగుటం గూర్చి విస్తరించి వచించి యిట్లనియె.

చ. కలఁడుగదా! సమస్తరిపుఘస్మరుఁ డైన ప్రదీప పుత్రుఁ డ
య్యఘుని శంతనుం బిలిచి యాత్మజనిచ్చి ననున్ గృతార్థుఁగా

నలువుము దీని హేతువున సద్గతి నీకును నాకుఁ గూర్చ మి
క్కలికి నిఁకేరు గోరినను గైకొన నీయకుమన్న ! గర్విన్ననన్.

దీనింబట్టి చూడఁ దన చెలికాఁడగు వసురాజు కోర్కె చెల్లు నని దేవేంద్రుఁ డిట్లొనర్పించి యుండును.

భీష్మ- తండ్రీ ! నీ వియ్యనఘుం దోడ్కొని తగు గౌరవమ్మునఁ జూచి మన్నించుచుండుము. నే నిప్పుడ యీయన యానతింజేసి యరిగి

ఉ. బంగరు తేరిమీఁద నల భార్గవివోని మదంబ నుంచి పే
ర్మిం గొనితెచ్చి యెల్లరును మెచ్చుకొనందగు మేటి కల్మి న
ర్ధాంగిగఁ జేతు నీకుఁ జరితార్థుఁడ నౌదు మదంబకన్న నా
పెం గడు భక్తిఁగొల్తు నిఁక వేఱు వచింపకుమయ్య! క్రమొక్కెదన్.

(అందఱును నిష్క్రమింతురు.)

గ ద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁబడిన
పాండవ జననమ్మున ద్వితీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

పాండవజననము

తృతీయాంకము

[అంత నిరువురు ఋషి బాలురు ప్రవేశింతురు]

ప్రథ - చెలికాఁడా! జామదగ్న్యముని తన యాశ్రయము విడిచి యియ్యెడకు రాఁగత మేమై యుండునో?

ద్వితీ - ఏమీ? కారణము నీ వెఱుఁగనే యెఱుఁగవా? ఆయనతో నవ కుసుమ సుకుమారాంగియు యోగినీ వేషధారిణియు నగు నొక కన్నియ యున్నది చూచితివికదా?

ప్రథ - ఆ! చూచితిని. ఆపె యెవ్వరో? ఈయన వెనువెంట నుండు టకుఁ గారణమేమో?

ద్వితీ - తుదముట్ట వినుము. ఆమె కాశీరాజపుత్రి. అంబ యనునది. అంబికాంబాలికలు ఈమె చెల్లెండ్రు. ఈ మువ్వురకును దండ్రి స్వయంవరము చాటింపఁగా గాంగేయుఁడు సకల రాజలోకము నోడించి కన్యకాత్రియమును దన రథమ్మున నిడికొని చని తన రెండవ తమ్ముఁడగు విచిత్రవీర్యునకుఁ బెండిలిసేయుతఱి నంబ యతనికి సవినయమ్ముగ నిట్లనియె.

ప్రథ - ప్రథమ సోదరుని వదలి రెండవవానికిఁ బెండ్లిసేయుట యెట్లు?

ద్వితీ - ఓహో! "సన్యాసి పెండ్లికి జుట్టుదగ్గరనుండియు నెర" వన్నట్లు నీకు బొత్తిగా నీ చరిత్రమే తెలియదే! సరే, ఆ సంగతి పదఁపడి విస్తరించి వచించెదను గాని ప్రకృతమును వినుము.

ప్రథ - కానిమ్ము. అంబ యేమనియెను?

ద్వితీ - తే. గీ. "సాళ్వభూపాలకునియందుఁ జాలవలపు
గలదు నాకు నాయందును గల దతనికి
బలపరాక్రమశాలివై పట్టితెచ్చి
తీవు ధర్మజ్ఞుఁడవు చెప్ప నేమి గలదు ?"

ఈ మాటకు భీష్ముండు సమ్మతించి సత్యవతి యనుమతిఁ గూడఁ గైకొని "నీవు నీ యిచ్చఁ జను" మని వదలిపెట్టెను.

ప్రథ - (స్మృతి నభినయించి) పదఁపడి వృత్తాంతము నేనును గొంచె మెఱిఁగినదే. ఆ రాజు "నీవు భీష్మునిచే నంటఁబడి రథమ్మున నుంచఁబడితివి గాన నిన్ను నే నొల్ల" నన నామె తిరిగియు భీష్మునియొద్ద కేతెంచి తన యవస్థ నివేదించుకొన నతండు "నీ వన్యసంగత చిత్తవుగాన నిన్ను నా తమ్మునికి వివాహము సేయ నొల్ల" ననుటయు నంబ జగదంబయై యుండెనఁటగదా !

ద్వితీ - (నవ్వి) అవును. పేరు విచారించినచో నీమె మాత్రమే కాదు. ఈ మువ్వురును జగన్మాతలుగా నుండఁదగినవారే. కానిమ్ము దీని కేమి. పిమ్మట "రెంటికిం జెడ్డ రేవణయై" ఋష్యాశ్రమముల పొంతఁ దపం బొనర్చుచుండ నొక్కతఱి యీమె మాతామహుం డరుదెంచి చూచి యావద్వృత్తాంతమును విని యోదార్చి "అమ్మా ! పరశురాముండు నాకుఁ బరమ మిత్రుఁడు కావున నీ వయ్యనఘునొద్దకుం జని చెప్పుము. అమ్మహనీయుండు భీష్మునిం బిలిపించి నీ యవమానము నెల్లనిఁ బాపఁగలఁడు" అని చెప్పఁగా మంచిదని యాపె భార్గవు నాశ్రయించెను.

ప్రథ - సరే, ఈ విషయమై జామదగ్న్యముని తన శిష్యుఁడగు భీష్ముని మందలించుటకే కాఁబోలును రమ్మని వార్త చేసియున్నాఁడు.

ద్వితీ - (దృష్టినిగిడ్చి) అడుగో దేవవ్రతుఁడు, గురుదర్శనార్థమై వచ్చుచున్నాఁడు. మనము శీఘ్రముగా సమిదాహరణం బొనర్చికొని పోయి వీరికిఁ బరస్పరముం జరగు ప్రసంగము విని యానందింతము. (నిష్క్రమింతురు.)

[భీష్ముఁడు ప్రవేశించును]

భీష్మ- (తనలో) గురువుగారు స్వాశ్రమమునుండి గదలి వచ్చియు హస్తిపురికి రాక, మధ్య నీ సరస్వతీతీరమున దిగి నన్నుఁ బిలువ నంపిరి. ఇందులకుఁ గతమేమో? కానిమ్ము తినఁబోవుచు రుచు లెందుకు? (పరికించి) అదుగో గురువుగారు ఎవరో యొక శిష్యురాలితో నేమో మాటలాడుచున్నారు. పోయి నమస్కరించెదఁ గాక.

[అంబాసహితముగఁ బరశురాముండు ప్రవేశించును.]

పర-శా. అంతేవాసియె మాకు భీష్ముఁడతివా? యాతండు మా మాటకున్
సుంతైనం బ్రతిచెప్ప నోపఁ డొకచో శుంఠత్వముం బూనిఁ దాఁ
బంతంబే వహియించుఁగాక పరశుప్రాగల్భ్యముం జేసి వి
న్నాంతుం జింతిలనేల? యోయబడిలు మో నీరేజపత్రేక్షణా!

అంబ- స్వామీ! యతఁడు మహాపరాక్రమశాలి యనఁగాఁ బ్రపంచమునఁ దానే యనియు నిఁక నెయ్యెడలను శూరులే లేరనియుం గడు గర్వించి యున్నాఁడు. కావునఁ దమ్మునుగూడ లెక్క పెట్టఁడనియే యే నూహించెద. స్వయంవరమంటపమ్మున ననేక రాజన్య సమక్షమ్మున నతండు వల్కిన ప్రగల్భములు చిత్తగింపుఁడు.

మ. "కలకుం గొడ్డలి వేల్పుకండు గురువౌఁ గానన్ బ్రణమ్యుండు త
క్కొరులౌ శూరుల శూరులంచు మది నే నూహింత మీరిప్పు డె
ల్లరుసుం జూడఁగ నీ లతాంగులను హేలన్ స్వీకరింతున్ వృథా
గరువంబేటికి? నిల్వరించి నను ధిక్కారింపుఁడా! భూపతుల్."

పర - (సంతోషముతో) వాని పరాక్రమ మట్టిదియే. వాని యెదుట నీ రాజలోకం బన నెంత? దేవతలైనను నిలువఁజాలరు.

మ. కృతవీర్యాత్మజుఁ డాఁగాఁ గల ధరిత్రీనాథులన్ బెక్కురన్
బ్రతిపక్షక్షితినాథదర్పదళన బ్రజ్ఞామహోత్సాహులన్
ధృతిమన్ముఖ్యుల నే నెఱుంగుదు నహో! దేవవ్రతుం బోలు న
న్నతుఁ డొక్కండును లేఁడు రాముఁడువినా నాచూచురాజన్యులన్.

అంబ- (తనలో) ఔరా! ఈ మహాసీయునికి శిష్యునియం దెంత గౌరవ మున్నది.

భీష్మ- (సమీపించి యంజలి ఘటించి)

సీ. ఏమహాభాగునం దిషువిద్య వెదఁజల్లి
మృత్యుంజయుఁడు కృతకృత్యుఁడయ్యె
ఎవని శక్తికి మెచ్చి యవనీధర కుమారి
కౌమరునికన్న నెక్కుడుగఁ జూచె
ఏ మహావీరు పే రెదనెంచి భీతిమై
నృపు లాఁడుపోఁడుముల్ నేర్చుకొనిరి
ఎవఁడు కారణముగాఁ నవనీసురుల కవ
నీపాలకత్వంబు నివ్వటిల్లె
తే. గీ. నెవనిపితరులు రాజన్య నివహరక్త
ధారలన్ దృప్తులైరి యే ధన్యతముఁడు
శాపమునఁ జాపమునఁగూడ శక్తి నెఱపె
నట్టి నీకు నమస్కార మనఘమూర్తి!

పర - (కౌఁగిలించుకొని) అబ్బాయీ! అటు గూర్చుండుము.

అంబ- (భీష్మునివంకఁ గోపదృష్టితోఁ జూచుచుండును.)

భీష్మ- (అంబవంకఁ దిరిగి తనలో) ఓహో! ఈమె యీ మహాసీయునికడ కేలరావలయును? (యోజించి) నన్ను గురువుగారు పిల్పించుటకుఁ గారణ మీ కుహనాయోగినియే యైయుండదుకదా?

పర - గాంగేయా! నీ లోకోత్తరమ్ములగు గుణమ్ము లన్నియు విని నేను సంతసించుచుంటిని. నిన్నుఁబోల నొరులకుఁ గాదు.

చ. "జనకుని పెండ్లిచేసి గుణసత్తమతన్ గయికొంటి" వంచుఁ "వ
మ్మునికి వివాహమున్ సలిపి ముజ్జగముల్ నుతికెక్కి" తంచు నీ
గొనములు మౌనిసత్తములు గూడి ప్రశంస యొనర్పఁగాఁ గడున్
వినివిని నీ వివేకమును వేగతులన్ మది నెంతు నిచ్చలున్.

మ. విలువిద్దెన్ బలుమంది కిచ్చితిని మీ పృధ్వీశులం దేమి పా
ఱులయందేమి నినుం బలెన్ మదికి నేరున్ మోదమున్ గూర్ప రీ
యిల నిన్నుంబలెఁ గీర్తికిం దెఱవులై యేపారఁబో రొక్కరున్
గలిగె న్నాకు భవద్వశంబున యశఃకైవల్యలీలాగతుల్.

భీష్మ- (తనలో) నన్నింతగా నీ మహామహుఁడు నుతించుట యెందు లకో? ఈ యుపోద్ఘాత మూరకయ బయలుదేరు ననుటకు వలను పడదు. తృణీకృత బ్రహ్మపురందరుండగు నీ జగదేకవీరునకు నా వలననే కాదు మ ఱెవ్వరివలనను గావలసిన కార్య మొం డుండదు. కానిమ్ము. ఏదో తేలకయుండునా? (వినయముగా ప్రకా శము) ఇదియంతయుఁ దమ యాశీర్వచనము. తమ శిష్య పర మాణువగు వీఁ డింతటినుతికిం దగఁడు. నాయందుఁ దమ కంత యనుగ్రహమేని—

ఉ. నాదగు బ్రహ్మచర్యము ప్రణష్టము గాక యొసంగునట్లు న
న్నేదెస నేరు నాజిని జయింపక యుండెడునట్లు సత్యమం
దాదర మబ్బునట్లు ధనమందు నిరాశ జనించునట్లు మీ
పాదయుగాశ్రితు న్ననుఁ గృపన్ గని దీవన లీయ వేఁడెదన్.

పర - నీ కీ గుణమ్ము లన్నియును స్వతస్సిద్ధముగనే యున్నవి. ఇందుల కొకరి యాశీర్వచన మెందుకు? (అంబను జూపి)

చ. అనఘుఁడవై సమస్తవిషయమ్ములయందును మేలుబంతివై
పనుపడు నీకుఁ జెప్పఁదగు పాడియె? యీ విషయంబు; శూరతా
ఖనివయి యీ కనత్కనక గాత్రిని దెచ్చి పరిత్యజింపఁగాఁ
జను నె? యనాథయై యిది భృశంబు గృశించె నిటుల్ పొనర్తురే?

తే. గీ. గతము చింతింపఁగా నేల కడిచిపోయె
నింక నేనియు నీ శర్వరీశవదన
ననుజునకుఁ బెండ్లిచేయు మీ యాఁడుగోడు
పోసికోనేల? నీవంటి పుణ్యమతికి.

ఆ. వె. అబల లస్వతంత్ర లగుటచే నంగనల్
వారిఁ బ్రోచుచుండవలయుఁ బురుషు
లెచట స్త్రీజనంబు లెలమిమై వర్తింతు
రచట నిల్చు లక్ష్మి యనవరతము.

ఉ. అంగనలన్ వృథాగ నెవఁ డాఁడిపెట్టి తిరస్కరించు నా
వెంగలికిఁ యశోబల వివేకములెల్ల నశించు నయ్యు నా
త్యంగడు నిందసేయుదురు యోగ్యులు "నీఁ డధముం"డటంచు; స
త్సంగతిగల్గు నీకిది యశస్కరమౌనె? తలంచి చూడుమా.

భీష్మ- (తనలో) ఓహో! తుద కీ యనాత్మజ్ఞ యీ యుపాయ మాలోచించి యీ మహాత్ము నాశ్రయించినది. ఆశ్రిత పక్షపాతిత్వము మహామహులకు సహజం బగుటచే నియ్యనఘుం డిందులకుఁ బూనుకొన్నాఁడు. కానిమ్ము. యథార్థము నివేదించిన వినక పోవునా? (ప్రకాశము)

మ. "ఎద నే సాళ్వునిఁ గోరియుంటి" నని తా నీ కన్నె నాతోడ దీ
నదశన్ జెప్పఁగ "నన్యసక్తహృదయన్ గైకొంట త" ప్పంచునా
ప్పాదవన్ బొమ్మని యానతిచ్చితి మహాయోగంబు చేకూరిన
ట్లది వేడ్కం జని వెంటనే మరలి తా నేతెంచె మా ప్రోలికిన్.

అట్లు వచ్చి సాళ్వుండు తన్నవమానించుటకుఁ గారణంబు నేను రథమ్మునుంచి తెచ్చుట యని చెప్పి తన చెల్లెండ్రతోఁ బాటు మదనుజునకుఁ దన్నుం గూడఁ బరిణయంబుఁ గావింపు మని వేఁడుకొనఁగ నే నంగీకరింపనైతి; అందులకుఁ గారణంబు సర్వజ్ఞులగు తమకు నేను వక్కాణింప నవసరములేదు.

క. కొండిక లగు కన్నియలకుఁ
బెండిలి యగు మీఁద నెట్లు పెండిలియౌ? నీ
యండజయానకు; నది గా
కొండొరు వలచిన లతాఁగి నొప్పునె కొనఁగన్?

పర - (కోపముతో) ఇంతకును నీవు చెప్పఁబూనిన ముఖ్యాంశమేమి?

ఈపె నధోగతి పాలుచేసెదననియేకదా ? ఏదోకొంచె మీ కన్ని యయందు లోపముండుటంబట్టియే యీ విషయము మా వఱకు వచ్చుటయు మేము నీకుఁ జెప్పుటయు నీవు మా మాట తృణీకరించుటయుఁ దటస్థించినది. నీ వీ స్వల్పలోపమున కీ యబల నింత యనాదరింతువేని నా చేయు ప్రతిజ్ఞ వినుము.

ఉ. చంపెద నిన్ను నీ యనుజుఁ జంపెద నీదగు బంధువర్గమున్
జంపెద నీదు భృత్యులను జంపెద నా కెవరడ్డమైననున్
జంపెద నీ పురంబు పెలుచన్ బరశుజ్వాల నాబ్ధిలోపలన్
దింపెద మున్నుబోలె నృపతివ్రజమున్ బనిఁబూని దంపెదన్.

(పండ్లు పటపటఁ గొఱుకుచు) ఏమీ! నాకు శిష్యుండవై యుండి యీమాత్రమునేని నా యాజ్ఞను మన్నింపనేరవుగా? అవురా! జాతి!

ఉ. క్షత్రియజాతి యంచెఱిఁగి క్షత్రియులెల్ల నపాత్రులున్ ద్విషద్గోత్రులు నం చెఱింగియును గొండొక కాలమునుండి "యెందుకీ శత్రుత" యంచు మిమ్ములను ఛాత్రులుగాఁ గొనుచుంటి నేఁడు నా గాత్రమశేషమున్ రగులఁగా గమకించితి వౌర! దుర్మతీ!

నీ వెట్టివాఁడవైనను నీ యందలి వాత్సల్య ప్రాబల్యముం జేసి యింకొక్కమాట చెప్పుచుంటి నాలకింపుము.

ఉ. ఈ కమలాక్షి కీవు గతి యేదియుఁ గల్పన సేయవేని యీ
లోకములో మఱొక్క నృపలోకశిఖామణి యాదరింపఁడే
కాకినియై యిటుల్ తిరుగఁగావలె యౌవన దుర్మదంబు పల్
పోకలు నేర్పవచ్చు నెటువోయిన నీ దురితంబు నీదగున్.

క. చిన్నతనము మానుము నీ
కన్న మూర్ఖుండఁ గానుగా ? నేను ; మృగా
క్షి న్నీదు తమ్మునికిఁ బెం
డ్లి న్నాకై సేయు మినుమడింపుము యశముల్.

క. ఎఱుఁగక తప్పొనరించియు
నెఱిగించిన యప్పు డెఱిఁగి "యేవ మిది" యటం

చరసి యది దిద్దుకొనుటయె
మరియాదసుమీ! వివేక మహితుల కెందున్.

భీష్మ- (తనలో) ఈ యనఘుండు తా నేది తలఁచిన "నది యట్లు కావలయు" ననువాఁడే గాని యొకరు చెప్పు త్రోవకు వచ్చు వాఁడు గాఁడు. పోనిమ్ము. "గుర్వాజ్ఞగదా?" యని యిందుల కొప్పుకొందుమన్న నియ్యది యనురక్త దాంపత్య మగుటచేఁ గులనాశనంబునకు హేతువౌను. కావున నేదేని తెఱంగున నీ మహాత్ము నొప్పించుటయు నొప్పకున్న నియ్యనఘు నాజ్ఞచొప్పున నాహవంబునకు దిగుటయు నిందుఁ గర్తవ్యములు. (ప్రకాశము)

చ. గురువరులయ్యు మాయెడలఁ గూరిమిగల్గిన వారలయ్యు నొం
డొరుల తెఱంగునన్ బలుకు టొప్పునఁటయ్య? పరానురక్తయౌ
తరుణి కుటుంబమున్ జెఱుపదా? యిటు దా ముపదేశముం బొన
ర్తురె! "వినలే" దటంచు నను దూఱుదురే! యిది నాదు దోసమే?

క. గురు లేమనినను శిష్యులు
త్వరపడఁగా రాదు వారె దయఁ జూతురు కో
పరసము కొందౌక మరలిన
తఱినట్లగుటన్ బ్రశాంతిదగు శిష్యులకున్.

తా మేమి వచించినను నయ్యవి మా కాశీర్వచనములు. తమతో మాకు వివాద మెన్నఁటికిని సమంజసముగాదు శాంతి వహించి యీ దీనుని మన్నింపఁ బ్రార్థించెదను. (అంజలిపట్టి నిల్చును.)

పర - (కోపముతో)

మ. "గురువీతం" డని పూర్తిగా నెఱిఁగియున్ గూర్మిరుండవేకాక ధి
క్కరణంబుం బొనరింతువే ఖలమతీ! కార్యం బకార్యంబు నా
నెఱుఁగం జాలక యేను జెప్పెదనె! నీవే నాకు బోధించుటల్?
గరువం బింత జనించెనే? సరి సరే కానిమ్ము యుద్ధం బిఁకన్.

ఓరీ! గురుద్రోహీ! క్షత్రియకులాంకూరమా!

చ. చిరమునసుండి శాంతమును జెందిన నా హృదయంబులోని చి
చ్చురులఁగఁ జేసియున్ బయికి యోగ్యగతి న్నటియించుచుంటి వే
నెఱుఁగనె? యింతమాత్రి మిదియే పరికింతువుగాక బ్రాహ్మణ
స్ఫురణము వేగఁబోయి బలముల్ గొలువఁగ జనుదెమ్ముపోరికిన్.

భీష్మ- (తనలో) ఇఁక గురువుతో గుద్దులాట యెట్లును దప్పదు. తప్పకపోవుఁగాక! ఇదియును గుర్వాజ్ఞ గనుక నంత తప్పిదము గాదు. కాని వాక్పారుష్యము మాత్రము వారికిఁ జనుఁ గాని నాకు లేశమును జనదు. కావున వినయముగనే మనవిచేసికొందుఁగాక. (ప్రకాశము) దేవా! దేవర వృథాగా నాపై నిట్లు కినిసిన నే నేమి మనవి చేసికొనువాఁడను?

శా. నాకుఁగ మీకును బోరు న్యాయమగునే? నన్మీరు నిర్జించినన్
మీకున్ గీర్తిఘటిల్లునే? యొకట నేమిమ్మోదఁగాఁ జేసినన్
లోకుల్ కాకులు గేలిసేయరె? దయాశత్వంబు వోనాడి నా
పైకిన్ వచ్చుట ధర్మమే? రిపుఁడనే? ప్రాజ్ఞుల్ ప్రశంసింతురే?

పర - (కోపముతో) ఏమీ! నీవే నన్ను నిర్జించెదవుగా? కానిమ్ము. నీకీ ధైర్య మెక్కడినుండి వచ్చినదో నే నెఱుఁగుదునులే.

ఉ. "రామునకోడె నీ పరశురాముఁ" డటంచును "వాఁడు క్షత్రియ
గ్రామణి" యంచునున్ దలఁచి కాఱులు ప్రేలఁదొడంగి తీవు శ్రీ
రాముఁడు నిన్నుఁబోలె నొక రాజకుమారుఁడు గాఁడు విష్ణు తే
జోమహితుండు నా వలెనె; సూక్ష్మమతుల్ గురుతింతు రింతయున్.

క. రాముండె నేను నేనే
రాముఁడు మా యిరువురకుఁ బరాభవ మనఁగా
నేమి? యిది యొప్పకుందురె?
ధీమంతులుఁ దత్త్వవిదులుఁ దేజోధికులున్.

కానిమ్ము. దీనికేమి? నీవు సైన్యసమేతుండవై యరుదెమ్ము. సకలమ్మును బదఁపడి తెలియగలదు.

భీష్మ-(తనలో) పృథివి పుట్టినది మొదలెవ్వరికిని దటస్థింపని దురవస్థ

నాకుఁ దటస్థించుచున్నది. కానిమ్ము. ఇందులకుఁ బ్రతిక్రియ కన్పట్టదు. నే నొకటి చెప్పిన వేఱొకటిగాఁ బరిణమింపఁ జేయు నీ మహామహునితో నేమి వచించినను గలహకారణమే యగుచున్నది. (ప్రకాశము) స్వామీ! తా మిప్పు డూహించినట్లు నేను దమ్మను జయింతునని కాని తాము శ్రీరామున కోడిపోవుటచే నస్మదాదులకుఁ గూడ లొచ్చని కాని నా యభిప్రాయము కాదు. నే నేమి మనవిచేసికొన్నను దమ హృదయమున కది యన్యథా పరిణమించుచున్నది. కావున—

ఉ. దేవరయాజ్ఞ చొప్పున నిదే యనిఁ జేయగ నియ్యకొంటి మీ
సేవ పొనర్చి మున్ను కృషిచేసి గడించిన శస్త్రవిద్యయే
పావన తేజ! నా కిపుడు బాసట సేసెడుఁగాక సేన లిం
కేవియు నాకు నేటికి? మహీయము మీ పదభక్తి చాలదే?

ఆజ్ఞయొసంగుఁడు. రథినై యరుదెంచెదను. (నిష్క్రమించును.)

అంబ - చూచితిరికద. మీ శిష్యుని దురహంకారము? నాకై యమోఘ వచస్కులగు తమ వాక్కుఁ గూడ వృథాగా వినియోగించితిరి. మిమ్ములనే యవమానించువానికి నాబోఁటి బోటి యొక లెక్కా?

పర - (కొంచెము కోపముతో) కుమారీ! ఇందు నీ లోపముఁ గూడ నున్నది గాని లేకపోలేదు. ఏమైనను మచ్ఛాసన మతిక్రమించుటఁ జేసి యవశ్యము నతని శిక్షించితీరెదను.

అంబ - అతఁడట్లు సమర్థించెనే కాని నా లోపము లేశమును లేదు. ఏమంటిరా? నే నీ స్వయంవరమునకు మున్నే సాళ్వుని వరించి యుంటిని. నా చెల్లెండ్రకొఱకు మాత్రమె స్వయంవర మేర్పడినది. వినోదముగాఁ జెలికత్తియలు నాకుఁ గూడ స్వయంవరోచితాలంకారమును జేసిరి. అంతియ కాని నే నిం దుద్దేశింపఁ బడిన దానఁ గాను. ఇది యిట్లుండ—

తే. గీ. బ్రహ్మచారిగదా! తాను బడఁతి నెట్టు
లంటె? నిదియు స్వయంవర మగుట యెఱిఁగి

యప్రయోజకుఁడగు తన యనుజు కౌఱకుఁ
గోర్కెలేని మమ్ముల నేల కొనఁగవలయు ?

నేను "పరానురక్త" నని కదా: యీతండు మీతోడఁ జెప్పుచున్నాఁడు. నా చెల్లెండ్రుమాత్ర మాతనిం గోరి వరించియుండిరా ? అగస్త్యభ్రాత యన్నట్లు భీష్ముని తమ్ముఁ డనుట తప్ప నతని పేరేని యెవ్వరికిని దెలియదు. ఇది యిట్లుంతము. ఈతని పెద్ద తమ్ముఁడు చిత్రాంగదుఁడు గడుఁ బొగరునఁ జరింపఁ గని చిత్రాంగదుం డను గంధర్వుఁడు రూపు మాఁపెఁ గదా ! అప్పుడీ గాంగేయుని పరాక్రమ మేమయ్యెనో యోజింపుఁడు.

[అపటీక్షేపముగా గంగ ప్రవేశించును.]

గంగ- (తనలో) కొమరునిపై గురువయ్యును స్వల్పవిషయమ్మునకు భార్గవుండు గనలుచున్నాఁడని సరస్వతి నాకుం జెప్పెఁగావున నమ్మహాసీయు నెట్లేని యనునయించెద. (సమీపించి ప్రకాశము) మహాత్మా ! చిఱుతయగు శిష్యునిపై నలుగుట తమకు ధర్మము కాదు. నా మొగమేనిఁ జూచి నా కొమరు ననుగ్రహింప వేఁడు కొనుచున్నదానను.

పర - (వైమనస్యముతో)

క. ఎక్కడి గురుఁడను నే నిం
కెక్కడి శిష్యుండు వాఁడు ; హీనుని గతి న
న్నక్కట తృణీకరించెను
ధిక్కారము సైఁపు టెట్లు దీర్ఘచరిత్రుల్.

నీ యందు నేను గౌరవములేనివాఁడఁ గాను. నన్నూరక మోమోట పెట్టకుము. విచ్చేయుము. అంత వలసినచోఁ బుత్రునికి బుద్ధి చెప్పుము.

గంగ- ఈ యనఘుని మనము పూర్తిగాఁ జెడియున్నది. ఇఁక నేనేమి వచించినను లాభములేదు. పోయి కొమరునికే బోధింతుఁగాక ! (నిష్క్రమించును.)

అంబ- (తనలో) ఈపె వలన నీ రణము విచ్ఛిన్నమైనదని యను కొంటిని కాని యవంధ్య ప్రయత్నుం డగుటచే నిమ్మహనీయుం డీపె మాటలను వినిపించుకొనలేదు. (పండ్లు పటపటఁ గొఱికి) ఎట్లేని వాని శిరము ధరఁ ద్రెళ్ళవలయు. నా పరిభవానలము చల్లారవలయు. స్త్రీననికదా? నన్నింత నైచ్యముఁగాఁ జూచుట! కానిమ్ము.

ఆ. వె. స్త్రీల పట్టువలయు స్త్రీల సామర్థ్యంబు
స్త్రీల యోగ్యతయును స్త్రీల మనముఁ
దెలిసికొనెడిఁ గాక దేవవ్రతుం డొక్క-
యంబ కారణమున ననద యగుచు.

[భీష్ముఁడు రథసహితముగాఁ బ్రవేశించును.]

భీష్మ- (వినయముతో)

తే. గీ. అంజలి ఘటింతు మీకు వీరాగ్రగణ్య!
మ్రొక్కెదను మీ పదముల కమోఘచరిత!
ఇదె నమస్కారమయ్య మునీంద్రవంద్య!
అయ్య! సాష్టాంగ మిదుగో లోకైకపూజ్య!

ఈ నా మనవి యొకటి చిత్తగింపవలయు.

ఉ. నే రథమందు మీరు ధరణీతలమందును నుండి పోరు నీ
తీరు నుతింతురే? రణవిధిజ్ఞులు నన్నిది వీడు మందురో
తేరికి మీరుఁగూడఁ బ్రియతింతురొ యూనతి యీఁదగున్ మహో
దారచరిత్ర! మీ కొరులు ధర్మము చెప్పెడిపాటివారలే?

పర - (సంతోషముతో) గాంగేయా! నీ తెలివితేటలకు నాకుఁ గడు సంతోష మగుచున్నది. నీ విప్పుడు నమస్కరింపవేని నిన్ను శపించియే యడఁచివేయుదును. ఇఁక నిన్నాశీర్వదింపవలసి యున్నను నే నిన్ను జయింపఁ బూనుకొంటచే విజయము తప్ప దక్కిన శ్రేయస్సులు గలుగున ట్లాశీర్వదింపఁబడితివి. మాకు రథాదికము సర్వమును నచ్చటనే సంసిద్ధము కాఁగలదు. రణో

చిత స్థలమ్మున కవతరింపుదము రమ్ము. (నిష్క్రమింతురు.)

అంబ- (చూచి) మునుమున్న భార్గవుఁడే శిష్యునిపై ననేకములుగ శరములు గుఱియుచున్నాఁడు. ఔరా! ఒక బాణమేని దన యరదము పొంతకుఁ గూడ రాకుండఁగనే గాంగేయుండు వారించి మరలఁ గొన్ని యమ్ములు గురువుపై నిగుడ్చుచున్నాఁడు. (ఆశ్చర్యముతో) ఈ యుద్ధము గడు భరముగా నున్నయది. ఇది చూచుటకే కడు భీతి గలిగించుచున్నది. (ఆకసమువంకఁ జూచి) అంబరచరుల విమానము లెల్లయెడల నిండినవి. ఋషు లందఱును బరశురామ పక్ష మవలంబించినట్లు కనుపట్టుచున్నారు. ఔరా! యెన్నిసారి రివురును మూర్ఛిల్లి మరలఁ దెప్పిఱిల్లుచున్నారు. ఎన్నెన్నిమహాస్త్రములు ప్రయోగించి వారించుకొనుచున్నారు. (వినుట నటించి) గురువరుఁడు సింహనాద మొనర్చి యేమో అనుచున్నాఁడు.

(తెరలో)

ఉ. నిన్ననె చచ్చిపోతివని నే ననుకొంటిని గాని యంతలోఁ
గ్రన్నన నూర్పువుచ్చితివి కాఁగల తక్కిన బన్న మీ దినం
బున్నది కాచికొమ్ము పరిలయోగ్రము లీ శరముల్ భవాదృశుల్
వెన్నిడి పాఱిపోదు రివి వీనులు సోకిన యంతమాత్రనే.

అంబ- (బొమముడిపాటుతో) నిన్న నంతవఱకు వచ్చిన మాట సత్యమే కాని యంతకుము న్నీయనకుమాత్ర మీయవస్థ పట్టలేదా? తుద కేమి జరుగునో కాని యిప్పటికి గురుశిష్యులలో నొకరి కొకరెప్పట్లను దీసిపోయినట్లు లేదు. (పరికించి) భీష్ముఁ డేదో ధ్యానములో నున్నట్లు తోఁచుచున్నది. (ప్రక్కకుఁజూచి) ఎందులకో కలహాశన ముని యిటు డిగుచున్నాఁడు.

నార - (ప్రవేశించి) గాంగేయా! తత్తఱపడి యనుచిత కృత్యమును జేయుచున్నాఁడవు.

చ. వసువులు నిన్న రాతిరి యవంధ్యతరంబగు మోహనాస్త్రమున్
వెస స్మృతి కెక్కఁజేసి రది విష్ణువుపై గురువర్యుపై ద్విజా

గ్రసరునిపైఁ బ్రసారితముగా నొనరింతె ? యెఱుంగఁడీ శర ప్రసరణ మాగుమంత్రమును రాముడు నీమది నేమియెంచితో !

భీష్మ- (ప్రవేశించి) మునీంద్రా! అయ్యనఘుఁ డిద్దాని నాగుట యెఱుంగఁడను హేతువుననే నే నిది ప్రయోగింపఁ దగ దనుట యంత యుక్తి యుక్తముగాఁ దోఁచదు. మీ రనేక రణమ్ములు చూచి యుండియును నట్లు వచించుటకుఁ గత మారయఁ జాలకున్నాఁడ.

నార - (తనలో)ఇప్పట్లనీతనికిఁ జెప్పఁదగిన యుక్తియే లేదు.(యోజించి) ఇట్లగుఁగాక. (ప్రకాశము) గాంగేయా ! నీగురుండుసైన్యసమేతుండవై యనికి రమ్మన్నప్పుడు నీ వేమంటివోజ్ఞప్తికిఁదెచ్చికొనుము.

భీష్మ- (స్మృతి నభినయించి "దేవర యాజ్ఞచొప్పున" అనునది మరలఁ జదువును.)

నార - అదిగో" మీ సేవ పొనర్చి మున్ను కృషిచేసి గడించిన శస్త్ర విద్యయే" అని కదా ! చెప్పితివి. దాని కర్థమేమి ? నేను మీ యొద్దఁ జదువుకొన్న శస్త్రవిద్యచేతనే మీతోఁ బోరాడెదఁ గాని యితరము లేశమును సహాయముగాఁ గొనననిని యభిప్రాయము స్ఫురించుచున్నది. ఈ మోహనాస్త్రము నీవు వెనుకటి జన్మమునం దెఱిఁగినదియు నిపుడు వసువులచే స్మారితమైనదియుఁ గాని జామదగ్న్యుని కతన సంపాదించినది గాదు కావున —

ఆ. వె. సత్యసంగరుఁడవు సత్యప్రతిజ్ఞుఁడ
వనఁగ వినుతి కెక్కినట్టి ఘనుఁడ
వింత స్వల్పమునకు నిట్లేల వ్రతభంగ
మాచరించుకొనెదవయ్య వృథగ ?

భీష్మ- (తనలో) ఈ మహాముని కలహాశనుం డయ్యును నియ్యెడ నెందులకో వారింపఁ బూనుకొన్నాఁడు. (ప్రకాశము) మునీంద్రా! ఇప్పట్ల మీరు చెప్పఁబూనినది కొంత యుక్తి యుక్తముగనే యున్నను, సమంజసముగా మాత్రము లేదు. ఎవ రేమి చెప్పినను నేను రణమునుండి మరలువాఁడను గాను.

ఉ. వచ్చినఁజచ్చిపోవలె వెసన్ గురువర్యుని చేతిలోన, న
స్మచ్చటులాస్త్రసంపదకు మద్గురుఁడేనియు లొచ్చుగావలెన్
వచ్చినవాదు వచ్చెనిఁక వారణచేయకుఁ డయ్య! మీ నుడుల్
నచ్చవుమాకు; మాపయిఁజలంబు వహింపకుఁడయ్య! యియ్యెడన్.

నార - దేవవ్రతా! ఇంతటితో మీ సంగరము సమాప్తమే కాని యిఁక జరగనేరదు. దేవతలయు ఋషులయు నభిప్రాయము గట్టిగా నిట్టులున్నది. అడుగో జమదగ్ని కూడఁ దన కొమరునకు బోధింపుట కిటు వచ్చుచున్నాఁడు. పరికించితివా?

[జమదగ్ని ప్రవేశించును]

జమ- (తత్తరపాటుతో) తండ్రీ! పరశురామ!

ఉ. నాకయి ఘోరమైన ప్రతినన్ గయికొంటివి మున్ను. దానిచే
వ్యాకులమయ్యె లోక మటుపై నెటులో శమమున్ వహించి తా
కాఁకకు మాఁడియున్ మరలఁ గన్పడి క్షత్రియజాతి మెల్లఁగా
మేకొనె వృద్ధి వెంటనె శమింపఁగఁ బూనెదవయ్య! పుత్రకా!

[పరశురాముఁడు ప్రవేశము.]

పర - (నమస్కరించి) తండ్రీ? నేనొక్కటిఁ జెప్పెద నవధరింపుము.

ఉ. అప్పటి కార్తవీర్యరణ మాదిగ సంగరరంగమందు వీఁ
డెప్పుడుగాని వెన్కఁజనఁడింతయు లోక మెఱుంగు భీష్ముఁడో!
నిప్పులకుప్ప యాతఁడు నవిన్ వెనుదీయుట సున్న యూరకే
చెప్పగనేల? మమ్ముఁ గృపసేసి రణమ్మున కాజ్ఞ యీఁదగున్.

జమ - కుమారా! నేటి కిరువదియేడుదినములు కావచ్చెను గదా? ఒకరికొక రించుకేని దీసిపోతిరా? ఇదిగాక —

ఉ. శాపముఁ జాపమంచు రిపుసంహృతికై గల దొక్కయుగ్మ మిం
దాపదలందుఁ దప్ప మన కాద్యము ముఖ్యము. క్షత్రజాతికిన్
జాపము ముఖ్య మట్లగుట శాంతివహింపఁగదయ్య! యెందుకీ
పాపపుఁగృత్య మియ్యది తపస్వులకున్ హితమౌనె? పుత్రకా!

నార - కుమారా! చూచితివా? జమదగ్ని తన తనయున కెట్లు శాంత వచనములు బోధించుచున్నాఁడో? నీ వీ సమయమున గురుని కటమునకు నరిగి మ్రొక్కితివేని నిన్నాతఁడు మిగుల గౌరవించును. ఇంతకన్న నీ వయ్యనఘు నిర్జించుట యశస్కరంబని తలఁపకుము. నామాట వినుము.

(పరశురాముని యొద్దికిఁ దీసికొని చనును.)

భీష్మ- (తనలో) ఈ మునివచనం బుల్లంఘించితినేని మూర్ఖతగా నుండును. అంత గురుఁడు నన్నవమానించినచో నెప్పటిసమరము స్థిరమయియే యున్నదిగదా! (నమస్కరించును.)

పర - (తనలో) ఈతండు మోహనాస్త్ర ప్రయోగాభిముఖుండయ్యును నిమ్మని వచనంబులకతన వైరంబుడిగి నమస్కరించుచున్నాఁడు. ఇఁక నాకుఁ బంతమెందుకు? ఇట్లగుఁగాక (ప్రకాశము) శాంతనవా? నీ కతననేను ధన్యుండను కృతకృత్యుండను.

ఉ. నన్ను జయించి తీవు మునినాథులుసాక్షిగ మోహనాస్త్ర సం
పన్నతఁ జేసి నీజయ మపారముదం బొనఁగూర్చె నాకు నీ
కన్న ధనుర్ధరుండు త్రిజగమ్ములయందును లేఁడు నీకు సా
టెన్నఁగ నీవె నీకతననే యిఁక నే బలవంతుఁడంజుమీ.

(అంబ దిక్కై రి-)

ఉ. ఈతఁడు నాకె కాదు త్రిదశేంద్రులకేని యజేయుఁ డింకనో
పూతచరిత్ర! నీ వెటకుఁబోయెదవో యటఁబొమ్ము దూచితే
చేఁతకు మించినంతపనిఁ జేసితి శక్యముగాక పోయె నీ
వ్రాఁతకు నే నెవండ? మగువా! నగుఁబా టిఁక నేమి చేసినన్.

అంబ- (లజ్జాదైన్యములతో) గురువర్యా! మీ శక్తివంచనలేక యుపకృతికై ప్రయత్నించితిరి. ఇంతకన్న నేమిసేయుదురు? తమకు వృథాగా నింత పరిశ్రమ మిచ్చినందులకయి నన్ను క్షమింప వేఁడెదను. నా యవమానమా? ఇది యెన్నఁటికి నే విధమునఁ దీఱవలయునో అప్పటికి నా విధమునఁ దీఱఁగలదు. నాకు

సెలవొసంగుఁడు. నేను భవిష్యద్గతికయి యత్నింపవలయు.

(నిష్క్రమించును.)

భీష్మ- (వినయముతో)

ఉ. బాలుఁడ నైన హేతువున భావిగతుల్ గనలేక మీ యెడ౯
జాల నవజ్ఞ చేసితిని ధాతుఁడనయ్యు వృథాగ్రహమ్మునై
నాలములో నెదిర్చి యిదియంతయు దేవరయోర్పు కల్మి ను
చ్చాలిత మయ్యెఁగాక యిటునైతురె: వేతొక రెవ్వరేనియు౯.

నా కాజ్ఞ యొసంగుఁడు. (నిష్క్రమించును.)

జమ - తండ్రీ! యిఁక నీవీ చాపాయుధత్వ ముడిగి మావలెనే శాపాయు
ధుండవై వన్నెకెక్కుము. చనుము. మే మరుగుచున్నాము.

(అందఱును నిష్క్రమింతురు.)

గద్య.

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁబడిన
పాండవ జననమ్మునఁ దృతీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

పాండవజననము

చతుర్థాంకము

[అంత వ్యాసులు ప్రవేశించును.]

వ్యాసు-(తనలో సంతోషముతో)

మ. యమునా ద్వీపమునందు నన్నుఁగని కన్యాత్వంబు లోపించునం
చు మదిన్ జంకి త్యజించి పేర్మిమెయి నిచ్చో నన్ను ధ్యానించె నా
కమరె న్నేఁటికిఁ దల్లిఁ గాంచఁదగు భాగ్యం బెంతపుణ్యంబు నే
మముమై మున్నొనరించికొంటి నొ కదామాతల్లి నీక్షింపగన్ !

(స్మృతి నభినయించి) అవును. అప్పుడు తల్లితో "నన్ను నీ వెప్పుడు స్మరింతువో అప్పుడ నీ యెడకు వత్తు" నని చెప్పియుంటిని. కావునఁ బోయెదను (పరిక్రమించి) హస్తిపురికి వచ్చితిని. (యోజించి) తల్లి నన్నుఁగనిన పదపడి యేమైనదియు నెచ్చట నున్నదియు నుంతేని యెఱుంగక తపస్సమాధిలో నున్న నాకుఁ దల్లి యెక్కడ నున్నదియు నెట్లు తెలిసెడిని? అక్కటా! యెక్కడ కేగుదును?

(ధ్యానము నటించి)

ఉ. నా జనకుండు సన్మునిగణ స్తవనీయ చరిత్రుఁడేనియున్
నా జనయిత్రి సర్వ భువన స్తవనీయగుణాఢ్యయేని ని
ర్వ్యాజ పరోపకారపరమై మది నాయది యొప్పునేని నా
కో జగదీశ! నా జననియున్కి సమస్తము గోచరించుతన్,

(కన్నులు మూసికొని మరలఁ దెఱచి సంతోషముతో) ఆహా! భగవదనుగ్రహమువలన సమస్తముం గరతలామలకముగఁ బొడ

కట్టినది. ఔరా ! అప్పుడే యెన్ని మార్పులు జరిగినవి ! కాల మని వార్యము.

సీ. శంతనుండు మదీయ జననిఁ బెండిలియాడెఁ
గలిగి రిర్వురు సుతు ల్లలితమతులు
వారి బాల్యముననే ధారుణీపతి వోయె
భీష్ముండు రక్షించెఁ బిదప వీరిఁ
బదఁపడి గర్వియై ప్రథముండు మృతిచెందె
రెండవవాఁడు ధీరుండు ప్రబలె
నంబికాంబాలిక లతనికి సతులై రి
యతికాముకుండయి యతఁడు సమసె
తే. గీ. వంశ మంతరించెడి దురవస్థ వచ్చెఁ
దల్లిమాటకు గాంగేయుఁ డొల్లఁడాయె
దానిపై నాదు జన్మం బతనికిఁ దెలిపె
నాతఁడును సమ్మతించె న న్నంబ తలఁచె.

(సంతోషముతో) ఔరా ! భవితవ్యత ? ఎఱుఁగనియప్పుడును దల్లి యున్న యెడకే వచ్చితినే. (పరిక్రమించి) ఇదియే నగరు. (పరికించి) తల్లియును గాంగేయుండును నా రాకకయి వేచుచు నేమో మాటలాడు కొనుచున్నారు. పోయి నమస్కరించి జన్మమును గృతార్థముగా నొన రించుకొనియెద.

[భీష్ముండును సత్యవతియుఁ బ్రవేశింతురు.]

భీష్మ- తల్లీ ! ద్వైపాయనుండు తపస్వికతన జనించుటంజేసి బ్రాహ్మ ణుండనియు మనము క్షత్రియులమనియు సంశయించుచున్నట్టు లున్నావు. అట్టి సంశయము లేశమును వలదు.

ఉ. హైహయుఁ జంపి మీఁద జమదగ్ని తనూజుఁడు మద్గురుండు పూ
ర్ణాహుతిఁ జేసె క్షత్రియకులాంకురముల్ మఱి మొల్వకుండ ని
ర్వాహకుఁడై జ్వలత్పరశువహ్నిశిఖాతతియందు విప్రసం
దోహముగాదె క్షత్త్రికుల దోహదమయ్యె ననంతరంబునన్ ?

ఇదిగాక పారాశర్యుండుఁ గూడ నా వలెనే యిందు నియోగింపఁ దగిన వాఁడే కాని యన్యుండు గాఁడుగదా!

సత్య- తండ్రీ! సర్వధర్మము లెఱింగిన నీకు నేను జెప్పవలసిన దేమి యుండును. అతనివలననో నీ వలననో యీ వంశము వృద్ధినందఁ దగినది. లేనిచో నింతటితో విచ్ఛిన్నము కాఁదగినది.

వ్యాసు-(సమీపించి)

చ. బహుళత రామయమ్ములను బాపఁగఁ జాలెడు మాతృభక్తి దు
స్స్పృహదురిత ప్రచారము నసార మొనర్చెడి మాతృభక్తి తా
నిహపరశోభనంబు లుదయింపఁగఁ జేసెడి మాతృభక్తి నా
కహరహమున్ బ్రవృద్ధమగునట్టు లొనర్పుము తల్లి మ్రొక్కెదన్.

(నమస్కరించును.)

సత్య -(సంతోషముతోఁ దనలో) ఎంతధన్యాత్మురాలనోకదా! ప్రాజ్ఞుఁడగు పుత్రునింజూచి యానందింపఁగలిగితిని. విజితేంద్రియుండగు పరాశరుం డప్పు డీ నిసువు ననుగ్రహింప దేని యిప్పటి యవస్థం బట్టి నే ననపత్యురాలనే కావలసినదానను. నా కిట్టి సుయోగ ముండుటంజేసియే పరమవిరక్తుండగు నమ్ముని కట్టి ప్రవృత్తి గలిగినది. (కౌఁగిలించుకొని ప్రకాశము) తండ్రీ! చిరాయుష్మంతుఁడవయి సర్వవిధముల వన్నె కెక్కుము. పుణ్యాతిరేకమ్మునం జేసి తిరిగియు నిన్నుఁ జూడగలిగితిని.

భీష్మ- (నమస్కరించి)

శా. వేదవ్యాసుఁడ వంచు సర్వజగతీవిఖ్యాత పాండిత్య స
మ్మోదస్వాంతుఁడ వంచు ధర్మవిదులం పూర్ణుండవంచున్ భవ
త్పాదద్వంద్వముగాంచు వారలకుఁ బాపం బుండదంచున్ శ్రవ
స్స్వాదార్హంబగు నీ చరిత్రము వినన్ సంతోష మయ్యెన్ మునీ!

ఉ. ఇట్టి మహానుభావుఁడ వహీనమహత్త్వయుతుండ వీవు తోఁ
బుట్టినవాఁడ వౌదువఁట! పూర్వభవార్జిత పుణ్య మెట్టిదో?

నెట్టన నిన్ భరింప ధరణీతరుణీమణి యేమి నోఁచెఁ? నీ
పట్టణభాగ్యమేమొ? నినువంటి మహాత్ముని రాకఁ గైకొనెన్.

వ్యాసు-(గౌరవముతో) గాంగేయా! నీవంటి పావనచరిత్రులు మును లలోఁ గూడఁ గడు నరుదు. నీకు నాయందేకాదు. అందఱ యెడలను మంచియభిప్రాయమే యుండును. (తల్లిదిక్కై)

ఉ. ఎంతయొ కాలమాయె మునుపెన్నఁడు నన్నుఁ దలంపలేదు నేఁ
డింతగ నాపయిన్ దలఁపదేటికిఁ బుట్టె? వంచింపుమమ్మ? యే
చింతయొ లోన నున్నటులు చెప్పఁ దొడంగెగదమ్మనీ ముఖా
భ్యంతరదీప్తి దానిఁ దెలుపంగదవమ్మ యొకింత నీనికిన్.

సత్య- (విచారముతో) కుమారా! సర్వజ్ఞుండవయ్యును నన్నేల యడిగెదవు? నీ యనుజు లిరువురిలో జ్యేష్ఠుఁడు వివాహము కాకమున్న గతించె. ఇఁక రెండవవాఁడు వంశకరుండగునని తలఁచుచుండ నాతండును క్షయరోగగ్రస్తుండై వంశంబు నెగడింపకమున్న మృతిఁజెందె. ఇఁక నీతండు బ్రహ్మచర్యవ్రతస్థుఁడుగదా! చంద్రుఁడు మొదలుకొని యింతవఱకవిచ్ఛిన్నముగా నెగడుచున్న యిక్కురు వంశమునకు నేఁటికిట్టి దురవస్థ తటస్థించినది. (కన్నీరునించును)

వ్యాసు-(విచారించుట నటించి) తల్లీ! యీఅడిల్లుము. ఇందులకుఁ బ్రథమకారణము నీ తండ్రియగు దాశరాజు. నే నిట్లంటి నని నీ వన్యథా భావింపకుము.

ఉ. సర్వనిధమ్ములన్ మిగులఁ జాలినవాఁ డనవద్యుఁ డన్నిటన్
ధూర్వహుఁ డీతఁ డుండఁ దన తోకముగన్న సుతుండు విశ్వభూ
నిర్వహణం బొనర్చుటది నీతియె? దేవుఁడు మెచ్చునే? గుణా
ఖర్వులు సమ్మతింతురె? యిఁకన్ గులవృద్ధియు సంఘటిల్లునే?

ఇఁక నొక కారణము మన గాంగేయుని నిరంకుశత్వము. ఈతఁడు సకల ధర్మవేదియు శాంతుండును మహాసత్త్వుండును ననుటకు సందియము లేదు. ఐనను దైవవశమ్మునఁ గాశీరాజ

ప్రథమదుహిత కవమానము ఘటించు టట్లుండఁ దనకుఁబలె బలాత్కార సన్యాస మిప్పించినాఁడు.

ఉ. కొంచెము గొప్ప యాపెయెడఁ గొండొక దోషము గల్గుఁగాక యీ
చంచలబుద్ధి స్త్రీజనులు సాజముగాఁ గలవార లెందు మ
న్నించు మటంచు భార్గవుఁ డనింద్యచరిత్రుఁడు చెప్పినప్పుడే
నించుక లోఁదలంచవలదే ? కలదే ? యబలాపకారముల్.

ఈయెడ నీవుఁగూడ సమ్మతి చూపితివే కాని వారింపవయితివి.

సత్య- (తనలో) ఏమో యిప్పట్లు నితనియభిప్రాయమే యనుకూలముగా నున్నది. ఐనను శంకించినదానికి వగచిన ఫలమేమి? (ప్రకాశము) కుమారా ! దైవతంత్రము సర్వథా దుర్నివారముగదా ! ప్రతిక్రియ తోపచరివనివారణకై యత్నింపవలయును. అందులకై నిన్నుఁ దలంచితిని. నీవేమియుపాయము చెప్పెదవు ?

వ్యాసు-(తనలో)తల్లి ఈనియోగము నాపై నిడుటకే సంసిద్ధురాలై యున్నది. భీష్ముండు నేను బ్రహ్మచారినని తప్పించుకొన్నాఁడు. నేనునుదప్పించుకొందునేని యిఁక నీవంశ మచ్ఛిన్నము కావలసినదే! అదిగాక,

క. తన తను వెవ్వారివలనన్
జనియించునొ యట్టిజనని జనకుఁడునుం జె
ప్పినపని చేసి తనూజుఁడు
తన జననమునకుఁ గృతార్థతన్ గలిగించున్.

(ప్రకాశము) సర్వధర్మములు నెఱింగిన నీకు నేనేమి చెప్పఁగలను? నీవే యాజ్ఞాపింపుము.

సత్య- కుమారా ! నీ యనుజుని కళత్రింబులలో జ్యేష్ఠురాలగు నంబిక యందు దేవరన్యాయమున నపత్యం బుత్పాదించి యీ కురువంశమ్ము నుద్ధరింపుము. ఇయ్యది సనాతనాచారంబును శాస్త్రచోదితంబును నగుట నీ వెఱుఁగనిది కాదుగదా !

వ్యాసు-తల్లీ! ఇది శిష్టాచారంబును శాస్త్రసమ్మతంబును నగుననుట నిక్కువమే. ఐనను నా వంటి తపస్వికిమాత్రము గైకొనఁదగినపనికాదు.

ఉ. ఎన్నఁడు గాని కామినుల హేలలపై మతి లేక నిష్ఠఁగై
కొన్నతపస్వులేడ! తమకున్ గొడుకుల్ మఱికూఁతు లన్న భ్రాం
తి న్నశియించు సంసృతిగతి ప్రవణుల్ గృహదాసు లేడ? యీ
తెన్ను విరాగి కేగతి విధించెడి? రాగికిఁ గాని శాస్త్రముల్.

భవత్పాదసాక్షిగా నేను భూతభవిష్యద్వర్తమానములయందు స్త్రీ ముఖ వీక్షణమాత్రమునందేని యిచ్చలేనివాఁడనయ్యను.

క. తల్లియె వేదము శాస్త్రము
తల్లియె జపమున్ దపంబు తల్లియె గురువున్
దల్లియె సకలము తల్లియె
తల్లికి నెదిరించువాఁ డధమగతి నొందున్.

(గౌరవముతో) అందులో నెల్ల తల్లులవంటి తల్లివా?

ఉ. ధన్య పయోనిజాత వుచితజ్ఞవు రాజఋషీశ్వరుండు నా
మాన్యతకెక్క నవ్వసుకుమారివి ధీవరుఁడై యఖండసా
జన్యము గన్న దాశనృపు సాఁకుడు కూఁతుర వార్యలోకమూ
ర్ధన్యవు నీ వచోరచన తప్పదు వేదము దప్పెనేనియున్.

సత్య - (సంతోషముతో) కుమారా! పితృభక్తికి గాంగేయునిం బలె మాతృభక్తికి నిన్నుఁ బ్రపంచమెల్ల మెచ్చుకొనునట్లు వర్తించినందుకుఁ గడు సంతసించితిని. (భీష్మదికైఁ గి-) అబ్బాయీ! యీతని కంబికాంతఃపుర నికటగతోద్యానమ్మున నంద వసతి నేర్పఱచి యుపచారంబునకుఁ దగువారల నియోగింపుము. నే నంబికకడ కరిగి యిందుల కొప్పించి సుపుత్రుం డుద్భవించుటకుం దగిన సుకృతంబు నీఁదగు బ్రాహ్మణారాధ నాదికమం దప్రమత్తురాలనై యుండెదను.

(నిష్క్రమింతురు.)

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁబడిన
పాండవ జననమ్మునఁ జతుర్థాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

పాండవజననము

పంచమాంకము

(తెరలో)

తే. గీ. రాత్రియెల్లను విరహాభారమున వేగి
వేగినంతన రాగ మావిర్భవింపఁ
బుష్పవతియైన పద్మిని బొందుఁ జేయఁ
బోవుచున్నాఁ డినుండు కాముకుఁడు వోలె.

[సూర్యుఁడు ప్రవేశించును]

సూర్య-(తనలో) ఎవ్వరీలతాంగి! నన్నుఁ దన మంత్రశక్తిచే నాకర్షించినది. (ధ్యానించుట నటించి) ఓహో! యీమె యాదవవంశప్రభవుఁడగు శూరుని పెద్దకుమారిత. వసుదేవుని చెలియలు. కుంతిభోజుని దత్తపుత్త్రిక. (పరికించి)

శా. ఆ నవ్వున్ మొగ మా కచావళిపసం దా నేత్రపున్ సోయగం
బా నాదారగు కౌను నా మిసిమిజెన్నొ చిన్నియొయ్యారపున్
మే నా గుబ్బలపొంక మా యధరపున్మె లెంతకేనిం దగున్
దీనిన్ గూడనివానిజన్మ మది యంధీభూత మింతేటికిన్?

ఈ కన్నియ తన చెలికత్తియతో నేమో ముచ్చటించుచున్నది. ఈ లతాకుంజముదాపున నుండి వినియెదఁగాక (అట్లొనరించును.)

[కుంతి చెలికత్తెతోఁ బ్రవేశించును.]

కుంతి- సఖీ! ఇఁక మన మరుగ వచ్చును. నా సూర్యోపాస్తి యైనది.
(ఇరువురును బరిక్రమింతురు.)

సూర్య-(తనలో) ఔరా! ఈ కన్నియ యంద మిప్పటి యవస్థం బట్టి యెంత పవిత్రతరముగా నున్నయది!

మ. జలకం బాడి మడుంగుగట్టియు నిశాంచద్దీప్తి పయ్యంటలో
వెలికిం బాఱఁగఁ గేశపాశ మురువై వెన్నంటి జాఱంగ మేల్
తిలకం బంతగ దిద్దకున్న నొసటపై దీపించ నివ్వానసౌం
పులు శృంగారరసాధిదైవతములై పొల్పొందు శుద్ధంబులై.

(పరికించి) ఈ మృదుశాంగి నన్నతిప్రయత్నమున రప్పించియు నావంక కేని చూడక తనంతన పోవుచున్నయది. (ఎదురుగాఁ జని)

ఉ. ఎక్కడి కేగుచుంటి తరళేక్షణ! వీని ననాచరించి నీ
మక్కువ నిక్కమం చిటకు మంత్రబలంబునఁ జేసివచ్చితిన్
దక్కలకేమి నా మదనతాపము వాపు మనుగ్రహించి యీ
దిక్కు మరల్ప చూపు సుదతీ! యెద తీవర మాఁగ రాదిఁకన్.

చెలి - (అత్యాశ్చర్యముతోఁ జూచుచు నించుక తొలఁగును)

కుంతి- (తేఱిపాఱఁజూచి తలవంచి తనలో) అక్కటా! నే నిపు డేమి సేయుదును? ఈ యనఘుఁడు త్రయీమయుండగు సూర్యుండు. మంత్రశక్తిం దిలకింపుటకై నా యొనర్చిన పరీక్ష తుదకిట్లు పరిణమించినది. (యోజించి) ఇట్లగుఁగాక (ప్రకాశము) దేవా! నా తప్పులు సైఁచి నా మనవిఁ గైకొని నా కనుజ్ఞ యొసంగ వేఁడెదను! మున్ను చిన్ననాఁడు దుర్వాసునికిఁ బరిచర్య సల్పుతఱి నమ్మహాత్ముఁడు నాయందు మిగుల దయగలిగి యిప్పటి యీ మంత్రి ముపదేశించి 'ఇద్దానిమహత్త్వమిట్టిది' యని చెప్పి చనియె. నేఁ డీయెడ స్నానం బొనర్చుతఱి నమ్మంత్రంబు స్మృతికిం దగుల స్త్రీ స్వభావసులభమ్మగు చాపలమ్మున నిన్నుద్దేశించి పఠించితి. అంతియకాని వేఱొక దురభిప్రాయము కలదానను గాను. సర్వజ్ఞుఁడ వగు నీకు నేను వచింపుట పునరుక్తి యని యింతతో ముగించుచున్నదానను. నా యపరాధమును సైఁపఁగోరెదను.

సూర్య-(అనురాగముతో)

క. కోరితివి వచ్చియుంటిని
నూరక యే నెట్లు పోవనోపుదుఁ దరుణీ!
నా రాక గాంచుదేవత
లాఱడిసేయరె? వృథాప్రయత్నుఁడ నైనన్.

చ. ఎఱుఁగుదు మంత్రమంచు నది యిచ్చినమౌని మహానుభావుఁడం
చెఱుఁగుదు సర్వముం దెలిసి యీగతిఁ బల్కినయంతఁ బోవునే?
సరసిజనేత్ర మంత్ర మది సారము దప్పదె? యేను నీ వచ
స్సరణికి లోఁగి పోయిన, విచారణ సేయకు మింక నెచ్చెలీ!

ఇది యిట్లుంచుము.

ఉ. కోరఁగ లేదు నీవు నినుఁ గోరియె యేఁ జనుదెంతుఁ గాక పో
నీ రమణీ! యొకింత గరుణింపుము నింపుము పేర్మి నీదు నా
య్యారము మున్నునుంగని యహో! యని సొక్కుచునుందునేఁటికిన్
గౌరవపూర్వకమ్ముగఁ దగన్ బిలుపందియుఁ బోవ నేర్తునే?

(చేయి పట్టుకొనఁబోవును)

కుంతి- (తొలఁగి తనలో) ఈ యమలుఁడు నేను గన్యక నని యెఱిఁగియు ధర్మేతరంబగు పద్ధతికి దిగుచున్నాఁడు. ఇతనికి నే నేమి వచించినను మది కెక్కుట కడు దుర్లభముగా నున్నది. ఎట్లేని యియ్యనఘు నొప్పించి యిప్పాపమునకుఁ దొలఁగి కన్యకాత్వమును గాపాడుకొనవలయు. (ప్రకాశము) దేవా! యేను మానవ జాతిదానను. నీవు దేవతలలోనివాఁడవు. ఇట్టిచోఁ గడు నీచురాల నగు నన్ను నీవు గైకొననెంచుట న్యాయమా? ఇదిగాక నేను గన్యకను. నీవంటి ధర్మజ్ఞునకు వ్రతభంగం బొనరించుటధర్మమెట్లగును?

సూర్య-(చిఱునవ్వు నవ్వి) తలోదరీ! ఊరక కాలయాపనం బొనర్చుటకు నీవిట్లు పల్కుచుంటివే కాని దేవతలకును మనుష్యులకును నిట్టి సంబంధమున్నట్టు లనేక దృష్టాంతములు గలవు. ఇఁక నీ కన్యకాత్వముంగూర్చి కొంత యోజింపవలసియే యున్నది కాని—

తే. గీ. మొన్న మొన్న పరాశర మునివరుండు
దాశకన్యకతో నిట్టి తగులొనర్చె
నతఁడు దప్పగునేని యెట్లనుమతించు ?
ధర్మశాస్త్ర మొనర్చిన ధన్యమూర్తి.

వారిరువురకును జనియించినవాఁడే ద్వైపాయనుఁడు. అమ్మహాసీయు కతముననే ధృతరాష్ట్ర పాండురాజ విదురు లుద్భవించిరి. కొలఁది కాలమున వారిలోఁ బాండుండు నీకు భర్తయగు. ప్రకృత రహస్య మేరికిని దెలియకుండఁ గాపాడఁగల భారము నాది. సంశయింపకుము. నీకన్య కాత్వమునకు భిన్నంబు గలుగకుండ నేను వర మొసంగెదను రమ్మ. (చేయిపట్టుకొనును)

కు-తి- (స్పర్శసుఖమును సూచించి సిగ్గుతో) మహాత్మా! ధర్మవిరుద్ధంబని కాని లేనిచో నిన్నువంటి పురుషోత్తముం డెవ్వతెకు ఘటించెడిని ? (చేతితోఁజూపి) అదిగో నా పరిచారిక. దాని కీ రహస్యము దెలియకుండుట యెట్లు ? కావున నన్ననుగ్రహించి యనుజ్ఞ యొసంగుము.

సూర్య-(నవ్వి) లతాంగీ! సర్వసాక్షినగు నాకుఁ దెలియదనియా నీ విట్లు చెప్పుచుంటివి ? మీ రాజులలో స్త్రీలకేమి పురుషులకేమి నాకుఁ దెలియని రహస్యములేని యుండవచ్చును. గాని దాసీదాసాదులకుఁ దెలియని గోప్యము లుండవుగదా ?

ఉ. వారలె మీరు, మీరె మఱివారలు, వాంఛ్రకు మీకు నించుకే
నారయ భేదముండ, దిటులైననె మీ మరియాద సాఁగు. నా
చారమనాదిగా నిటు లెసంగుచునున్నది చంచలాక్షి ! న
న్నూరక యేఁచనేల ? దయయుంచి కృతార్థునిఁజేసి పంపుమీ.

మీకును బరిచారికలకునుంగల యాంతరంగికత్వ మిట్టిదట్టిదన వలనుపడదు. ఇది వినుము. సత్యవతి తన కోడండ్రలో జ్యేష్ఠురాలగు నంబికను వంశము నిల్పుమని వ్యాసునియొద్ద కనుప నాపె యమ్మౌని యెడ నేవము గలిగి కనులు మూయుటం జేసిం తత్పుత్రుండగు ధృత

రాష్ట్రుం డంధుండయ్యె. మరల సత్యవతి యంధుఁడు రాజ్యార్హుండు గాఁడని వ్యాసుని రెండవకోడలగు నంబాలికతో సంఘటించె. అయ్యాతివయు వెలవెలఁ బోవుచు నజ్జటులునియం దనాదరముఁ బ్రకటించె. అక్కతన నాపెకుఁ బాండురోగగ్రస్తుండగు పాండుం డుదయించె. పదఁపడి సత్యవతి విచారించి కొమరునిం జూచి.

క. పాయక నా యనుమతిచే
దాయాదులఁ గంటి వంధతాపాండుత్వా
పాయ సము పేతు లేగతిఁ
చేయఁగనగు రాజ్య మేమిసేయుదుఁ బుత్రా ?

అని మరల నికనొక కొమరునిం గనుమని పెద్దకోడలికి నెట్టకేలకు నచ్చఁజెప్పిన నయ్యతివ, యాకృతి యేవమగు టట్లుండ శాస్త్రదూష్యము గూడనని యెంచి తన దాసిని సర్వాభరణ భూషితురాలుగా నొనర్చి తన కేళీగృహమ్ముననుండ నియమించె.

క. దాసియు వ్యాసుని మది కు
ల్లాస మ్మొదవింపఁదగువిలాసము లొప్పన్
జేసిన నంతట దానికి
వ్యాససముఁడు విదురుఁడనెడివాఁ డుదయించెన్.

ఆ విదురుఁ డిప్పుడు సర్వవిధముల వారితోపాటు గౌరవింపఁబడుచున్నాఁడు. దీనింబట్టి మీకును వాండ్రకునుం గల యైకమత్యము నీకుఁ బూర్తిగాఁ దెలిసియుండును. ఇంక నెందుకు జాల మొనరించెదవు. (చేతఁ జూపి) లతాంతసంతానదంతురం బగు నా నికుంజముఁ దిలకింపుము.

చ. దళముగ నల్లుకొన్నది లతాభవనం బది దానఁ బూలగు
త్తులు రతనంపుదీపములతోఁ దులఁదూఁగుచునున్న వింపుసొం
పులు గల పక్షిజంపతులు ముచ్చట లాడుచునున్న వయ్యెడన్
గలుగువిశేషముల్ గలయఁగాఁ గనుఁగొందము రమ్మ నెచ్చెలీ.

(కుంతి చేయిపట్టుకొని నిష్క్రమించును)

చెలి - (ఆశ్చర్యముతోఁ దనలో) ఆహా! నే నెట్టిపుణ్యము చేసికొంటినో? ఈమె చెలికత్తియ నగుటం జేసియే కదా! ప్రత్యక్షసూర్యునిం గాంచఁ గలిగితిని. (మరల యోజించి) అవునుగాని యీమె కియ్యనఘుకతనవేఁకటి యొదవినచో నయ్యది యెట్లు దాఁపనగును. అవురా! కన్నియలకు రజస్వలావివాహ మెంతటి దుర్దశ గలిగించుచున్నది. అతిబాల్య వివాహమువలెనే యియ్యదిగూడ దూష్యమే కాని వేఱొండుకాదు. (పరికించి తత్తఱపాటుతో) అత్యద్భుతముగనున్నదే? చిన్ని శిశువుం గైకొని కుంతియిటు వచ్చుచున్నది.

(శిశువుతోఁ గుంతి ప్రవేశించును.)

కుంతి- (విచారముతోఁ దనలో) అక్కటా దైవమా! ఈ పాపాత్మురాలి కింతటి చక్కని శిశువు నెందు కీవలెను?

చ. కలకలలాడు నెమ్మొగము కాంతులదొంతుల నీను మేను, సొం
పు లొలుకు ముద్దుకన్నుఁగవ పున్నమవెన్నెల నేలు పాలబు
గ్గలు ననుఁదేఁటిమొత్తమనఁగాఁదగుపెన్నెఱులున్ మృగేంద్రమున్
గెలిచెడి కౌను వీనికి నొగిన్ మృతి నేగతి సంఘటించితో!

(అతిదుఃఖముతో) అయ్యో నేనేమిసేయుదును? ఇయ్యెడ నీ చిన్ని శిశువు నీ నాముద్దులమూటను డించిపోయిన వీఁడు మృతి చెందక యెట్లు జీవింపఁగలఁగును?

ఆ. వె. ఎవ్వరెత్తుకొందు? రెవ్వ రాడింతు? రె
వ్వారు పాలనిత్తు? రేరు పెంతు
రకట? యెంత దుష్టురాల నైతిని దండ్రి!
నిన్నుఁ గనఁగనేల? నేను గుఱ!

అయ్యో కొడుక! నిన్ను నే నెట్లు వీడుదునోయి? చక్రవర్తివి కాఁదగిన లక్షణము లన్నియు నీకే కలవోయీ నాయినా! నా యనాథత్వము కారణముగా నీవు బాల్యమృతి నందుచుంటివి గాని నీకు నాయుర్దాయము లేకపోలేదు. తండ్రీ! యేమి సేయుదును? అయ్యో భగవంతుఁడ!

ఉ. సంతతిలేక పెన్వగల సారెకుఁ గుందుచు వందుచున్ మన
శ్శాంతి యొకింత గాన కొరు సాఁకఁదలంచియు సంశయించు సా
మంతులనేకు లుండఁ గొఱమాలినదానికి నాకు నిట్టి శ్రీ
మంతు నొసంగ నీకుఁ జలమా ? యిల మానిను లెందు లేరొకో?

చెలి - (దగ్గఱఁజని) నెచ్చెలీ ! సంతోషసమయమున విచారించెదవేల ? నీ కొమరుని కించుకయు భయములేదు. ఏదేని యుపాయముచేసి పెంచెద. ఊఱడిల్లుము. (శిశువుంగైకొని) తండ్రీ ! యెంత చక్కగా నుంటివోయి ! (కుంతిదిక్కై) మొగము మూఁడు ముహూర్తముల నిన్నుఁబోలి యున్నది. తక్కిన లక్షణములు మాత్రము చాలవఱకు సూర్యునింబోలియున్నవి. (అని ముద్దు పెట్టుకొనును)

కుంతి- (శిశువుంగైకొని) చెలీ ! ఈ శిశువు నీ వెట్లు గోప్యముగాఁ గాపాడినను నీ రహస్యమెట్లో బయలఁబడకమానదు. కావున వేఱొక యుపాయముఁ జూడుము ! (మరల దుఃఖముతో) తండ్రీ ! నీవిట్టి నిర్భాగ్యురాలి కడుపున నుదయించుట చేతఁగదా నీ కే యుత్సవములును నే రక్షలును లేకపోయినవి.

తే. గీ. అంతిపురముల నుండెడి యతివలేని
చ-టిపిల్లలరక్షకై జంకుచుండ్రు
కాన నేగతి డించెడిదాన నకట !
కనులు దెఱవని పసికూనకాన ! నిన్ను.

(కోపముతో)

ఉ. ఏమని యొప్పి నారొకొ ? మునీంద్రులు ధాము రజస్వలాంగనల్
ధామములందుఁ బెండ్లికి నెదన్ దపియించెడిరీతి కక్కటా !
కామము గెల్వ శక్యమె ? యఖండమనీషులకేని యట్టిచోఁ
గామిను లేడ ? కామునివికారము లేడ ? సతుల్ యతీంద్రులే ?

ఔరా ! అనుభవశూన్యులగు మాన్యులవలన జగంబున కెట్టి యిక్కట్టులుప్పతిల్లుచున్నవి. (సూర్యునుద్దేశించి) దేవా! త్రయీమయ !

చ. అరిగితి వీవు నాదుగతి నారయవైతివి సిగ్గుకల్మి ము
న్నరయఁగఁజాలనైతి నిటులౌట; కటా! శిశుహత్య కేగతిన్
గరములువచ్చు? నెట్లు చనఁగల్గుదు నీ పసికూన డించి? యీ
మరణము నీకు సమ్మతమె? మానినులన్ బయలెక్కఁజేతువే?

(పుత్రు నుద్దేశించి తన్మయత్వముతో)

తే. గీ. ఏడువకు తండ్రి? యేడువ కేడ్వఁబోకు
మేను నిను డించిపోను నీయాన కూన!
కులము పోనిమ్ము బంధుగుల్ చలముఁబూన
నిమ్ము కానిమ్ము మఱియు నేమేనివమ్ము.

అక్కటా! యెట్టిచిక్కు తటస్థించినది?

శా. దుర్వాసుం డరుదేరనేల? యతఁడీ దుర్మంత్రము న్నాకు నం
తర్వాణీశ్వరుఁడయ్యు నేటికొసఁగెన్? దచ్ఛక్తి గుర్తింప నే
సర్వాతీతు వరింప నేమిటి కినున్? సర్వజ్ఞుఁ డద్దేవుఁ డం
తర్వర్తిన్నిత్వవిచారణం బుడిగి చింతల్ గూర్పఁగా నేటికిన్?

చెలి - (పరికించి) రాజపుత్రీ! భాగీరథివంకఁ జూడుము. ఏదో యొక పెద్ద పెట్టె యొడ్డు దరినుండి నీటఁ దేలిపోవుచున్నయది. మన మిప్పు డద్దానిం బట్టికొని యీ శిశువునందుఁ బదిలముగా మంచి మరల విడిచితిమేని యియ్యెడ కసతి దూరమ్మనఁగల పల్లెలోని జనులెవ్వరేని యా పెట్టెఁ గైకొనవచ్చును. పదఁపడి యీ పసి బాలునిం జూచి పెంచి పెద్దఁగాఁ జేయుటకూడఁ దటస్థింపఁగలదు. ఇంతకన్న సదుపాయ మియ్యెడఁ గానరాదు. నే నరిగి యా పెట్టెను బట్టికొందును. నీ వీ శిశువుం గొని నావెంట రమ్ము.

(నిష్క్రమించును.)

కుంతి - (తనలో) ఇప్పటికీ యుపాయమే కదు ననుకూలముగా నున్నది. ఇట్లొనర్తుఁగాక. (కొంత నడిచి విచారముతో)

సీ. ఏయదృష్టవతి నిన్నెత్తి పెంచికొనంగ
నోఁచుకొన్నదొ నాయనుంగుఁ గుఱ్ఱ

ఏభాగ్యవతికిఁ జన్నిచ్చి నిన్ బోషించుఁ
బున్నెమున్నదొ నాదు చిన్నికూన
ఏ పుణ్యవతి నీదు సేవఁగాంచుచు మోద
మందనున్నదియొ నా యాత్మజాత
ఏ కృతకృత్యురా లీ వాడు తొలిపల్కు-
లాలింపఁగలదొ నాపాలిపంట

తే. గీ. ఏ మహాభాగ నీదు విద్యామహోద
యంబు నీ పెండ్లి నీ యపత్యాభివృద్ధి
యాదిగాఁగల సంపద లరసి నీదు
మన్ననలు గాంచఁగలదొ నా కన్నతండ్రి!

తే. గీ. ఏనె దురదృష్టవతిని నీ యెల్ల వగలు
గాంచఁగా నోఁచుకోలేని కారణమున
నెచట నీవున్న నీ యభివృద్ధిఁ జూడఁ
జాలు నాతండ్రి! నీ తండ్రి సర్వసాక్షి.

మ. నిను రక్షించు సహస్కరుండు పగట నీతండ్రి నాతండ్రి! ని
న్ననుఁబోషించు నిశాకరుండు నిశలందున్ ద్వత్పితృస్నేహి ని
న్ననుఁ గాపాడుతఁ బంచభూతములు నిన్నున్ జహ్నుకన్యాంబువుల్
మనుచున్ నిన్నెగడించుఁగాత సకలామ్నాయమ్ములున్ భూమియున్.

(తెరలో)

సఖీ! రమ్మ తడయకుము. ఈ యేటివంపులో నెవరో కాని దంపతులు స్నాన మొనరించుచున్నారు. ఈ పెట్టె నీ శిశు సహితముగా వారు గైకొనఁ గలరు. దాన నీ కొమరునకు క్షేమంబు గలుగును. మనము వారి కగుపడకుండఁగనే పోవుటకుఁ గూడ వీలుగా నున్నది.

కుంతి- (దుఃఖముతో)

తే. గీ. మరల నినుఁ గాంతునో లేదొ కొఱఁత దీఱఁ
బాలు ద్రావుము నాతండ్రి! జాలి లేని

కఠినురా లిది యని మార్గ్మగంబు గాకు
మన్న ! నా చిన్ని యన్న ! నా యాన నీకు.

(కౌంతవఱకు నడిచి)

చ. కనియును నిన్ను వంటితగు కానుపు నెన్న(డుగాని సంతతిన్
గనని యనాథవోలెఁ గొడుకా ! యుడుకాఱెడివంత నెంతయున్
గనవలసెన్ బురాభవమునన్ సుతసంపద పెట్టి పుట్టకుం
డిన ననువంటిదాని కిడునే పరమాత్మ సుతున్ భవాదృశున్ ?

తండ్రీ ! నీవు పెద్దవాఁడ వైనపిదప నెప్పుడేని నీకు నేను గనుపట్టినచో నన్నాదరింతువుగద ! పోనీ యాదరింపవద్దు తండ్రీ ! నీవు చిరాయుష్మంతుఁడవై వర్ధిల్లుము. ఇట్టి పాపాత్మురాలి నేల యాదరింపవలయును ?

(శోకావేశముతో)

క. సహజం బగు కవచమ్మును
సహజములగు కుండలము లెసంగెడి నీ వి
గ్రహ మెట్లు మఱచిపోఁగల
నహహా ! నిన్నెట్టు లేటి కర్పింతు సుతా !

(ధైర్యముతో)

ఉ. ఆకనుపట్టు దంపతులె యాత్మజ ! నిన్ గనుఁగొంద్రు గాక వా
రే కనువారిరీతి నినుఁ బ్రేముడిఁ బెంతురుగాక ! నాకు నీ
శోకము పోవునట్లు లొకచో నయినన్ భవదీయ మైన ది
వ్యాకృతి గాంచుభాగ్య మది యబ్బెడుఁగాక ! పురాకృతంబునన్.

(నిష్క్రమింతురు.)

గద్య.

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁబడిన
పాండవ జననమ్మునఁ బంచమాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

పాండవజననము

షష్ఠాంకము

(తెరలో)

తే. గీ. ఓరి కఠినాత్మ ! యోరోరి క్రూర ! యోరి
చంద్రవంశాబ్ధిబడబాగ్ని ! సాధుదూర !
దంపతుల గ్రామ్యకర్మసందర్భగతుల
నడఁచితి విదేమిరోరి ! నీచాతినీచ !

(పాండురాజు చాపధరుఁడై ప్రవేశించును.)

పాండు-(తత్తఱపాటుతో దెసలు పరికించి) ఇది యేమి వింత ?

క. మృగమిధునం బని కొట్టితి
నగపడ దది యీమునీంద్రుఁ డతిరోషోగ్రుం
డగపట్టనేమి ; యకటా !
తగిలెఁగదా ! బ్రహ్మహత్య దైవముకలిమిఁ.

(విచారముతో) ఆహా ! యెంతదుర్మార్గుఁడ నైతిని ! ఈ తపస్వి ప్రళయకాలరుద్రుండో యన నాపైకి దుముకుచు వచ్చుచున్నాఁడు. కోపావేశంబుచే బాణపాతవ్యథ నించుకయు లెక్కింపఁడు సరిగదా తొరఁగెడి రుధిరమునేని గణించుటలేదు. ఇందేమి గతి ? (నివ్వెఱతో నిల్చును.)

కిందముఁడు-(యథోక్తముగాఁ బ్రవేశించి, "ఓరికఠినాత్మ" యనునది మరలఁ జదువును.)

పాండు-(వినయముతో) స్వామీ ! క్షమించి నా విన్నపమాలింపవలయు.

ఉ. మీరెకదా విధించితిరి మేదినికిన్ హితమంచు నెంచి యా
చారముగా నృపాలురకు సాజము వేఁట యటంచు దీనియా
ధారమునన్ జరింతు మిది ధర్మముగాఁదలపోసి మేము. నేఁ
డారయకున్కి యిట్టిపని యయ్యె మృగంబులె యంచు నేసితిన్.

అంతియకాని మీరని యెఱిఁగి చేసిన పనికాదు. మన్నింప వలయు. మీరు మృగాకృతితో నుంట నన్నీ మహాపాపమునకుఁ బ్రేరేపినది. నేనేమి సేయుదును. తమ కీ బాధ యుపశమింపఁ దగు నుపచారముం గావించెదను నన్నాశీర్వదింపుఁడు.

కింద - (కోపముతో) ఓరీ! దుర్మార్గా! ఇఁకను మమ్మే యధిక్షేపించు చుంటివిరా! రాజులకు వేఁట యెందులకుఁ బెద్దలు విధించిరో యెఱుఁగుదువురా?

ఉ. క్రూరమృగంబు లేవయినఁ గుంభినికిన్ బ్రజకున్ దురంతమౌ
తీరు నుపక్రమింప నది తీర్చుటకై మృగయాపరత్వ మా
చార మటంచుఁ దెల్పి రిటు సాధుమృగంబులఁ బట్టిచంపు టా
చారమె? వీరధర్మమె? యశస్కరమే? పరమోపకారమే!

మేమే మైనఁ గ్రూరమృగముల యాకారమును ధరించి యుంటిమిరా?

క. కనుపట్టినంతనే యో
జనములకౌలఁది బరుగిడెడు జంతువులఁ గృపా
ఖనుల నిసుఁదక్క రాజులు
చెనఁకుదురే? లేళ్ళనెందుఁ జెనఁటివితమునన్.

అదిగాక స్వతంత్రేచ్ఛుల మగుమాకు నీయాజ్ఞయేమి! మా యిచ్ఛవచ్చిన చొప్పున వర్తింతుము.

చ. ఇది మృగకృత్యమంచు మదినెంచియొ లేక మదీయభార్య కి
య్యది హితమైనదన్నహృదయంబుననో మఱియొండుహేతువో
యొదవుటచేఁ గురంగగతి నుండి రమించుచు నుంటి మిట్టిచో
నదయుఁడవై వధింపఁదగవా? పగవారము రోరి దుర్మతీ?

ఓరీ పరమమూర్ఖుఁడా !

తే. గీ. మృగము లేవేనియును వధియించుపనికి
నృపతు లర్హులెయని వచియింతువేమొ
అఖిల జంతుసాధారణ మైన సుఖము
వేళఁ గొట్టఁగ నేల ? వివేక మెడలి.

చ. పరుగిడలేనిదానిని వ్యవాయపరంబగుదాని నీనఁగా
మఱఁగినదాని రోగమున గ్రమ్మినవ్రాత్రుదానినిఁ గొట్టనోడువా
రెఱుకులుగూడ నీవు మనుజేశుఁడవై యెటు లాచరించి తీ
మొఱకుఁదనం బిసీ! కులము ముందుకుఁ దెచ్చునె యిట్టి దుష్కృతుల్.

కానిమ్ము నీ కి ప్పాపమ్మునఁజేసి ప్రియాసాంగత్యమ్ము మృతిప్రదంబగుఁగాక. ఇఁక నిచ్చం జనుము. నాకుఁ బ్రాణములు కంఠగతములగుచున్నవి. నన్ను నింతకు మున్న గతప్రాణయై యున్న నా ప్రియురాలి కడకుం జేర్పుము; జాగు సేయకుము. (చతికిలఁబడును.)

పాండు-(తనలో) సంతాన మువయింపక మున్నే యిట్టి శాపము దటస్థించెఁగదా! (ధైర్యముతో) కానిమ్ము. ఇప్పుడీ విచారమునకుఁ దఱిగాదు. (ప్రకాశము) మునీంద్రా! నన్ను వృథాగా నెందులకు శపించెదవు? శాంతిం గైకొని యిప్పుడేని యిందులకు నిష్కృతి ననుగ్రహింపుము. రాజులకు వేఁట యనునది నిన్న నేఁట వచ్చినది గామగదా! అగస్త్యనంతటి మహాముని విధించినట్లు మీవంటి పెద్దలు సెప్పుదురు. అయ్యనఘుండు మృగమాంసంబు పితృ ప్రీతికరంబని వాకొచ్చెఁ గావున నిది ధర్మేతరంబని తలఁచి న న్నధోగతిపాలు సేయకుము.

ఉ. సంతతి లేదు నాకుఁ బెలుచన్ శపియించితి వేమిసేతు? నా
యింతులు నిన్ను దూఱుదు రి దేగతినైనను ద్రిప్పుమయ్య! నీ
యంతటివాని కింతటి మహాగ్రహ మొప్పునటయ్య? యౌవనం
బంతయు నేమిసేయవలెనయ్య మహాత్మ యిటుల్ శపించినన్?

కింద- (హీనస్వరముతో) రాజా! నీవు పశ్చాత్తప్తుండ వగుటచే ననుగ్రహింపఁబడితివి. నీకు సంతానముమాత్ర ముదయించు నిఁకఁ జింతింపకుము. నన్ను నా ప్రియురాలిం జేర్పుము.

పాండు-(తనలో) ఇయ్యనఘుఁడేమో యించుక కరుణించినాఁడు. కానిమ్ము. వివాహము సంతాన ప్రధానమైనదియే కదా? ఇఁక నితని నయ్యేడకుఁ జేర్పించెదఁగాక. (ప్రకాశము) ఎవరురా అక్కడ?

[మృగయుఁడు ప్రవేశించి]

మృగ- ఏమి సెలవు?

పాండు-త్వరలో ని మ్మహానీయు న య్యేడకుం గొనిపొమ్ము.

మృగ- చిత్తము. (దగ్గఱకు వెళ్ళును)

కింద- (కోపముతో) ఓరీ పరమదుర్మార్గ! నన్నీ నీచునిచే నీడ్పించెదవురా? (ధ్యానించి) కానిమ్ము. నీవేమి చేసెదవు? భావిగతి నీకిట్టి రాజసము నుత్పాదించుచున్నది. లేనిచో—

క. అనుచితమగు కృత్యము మొద
లొనరించియు బుద్ధిలేక యొకటికిఁ దోడాం
డొనరింతువె? రాజకులం
బునకున్ రాజ్యమ్ము మిగుల ముప్పొనరించెన్.

ఉ. భారతమాత యీపుడమి; పావను లిందు జనించువా రనా
చారులు నేఁటికిన్ బ్రబల సాఁగిరి రాజులు మిమ్ము బోఁటు లీ
కారణమై క్రమక్రమముగా మిము పీడఁగ నున్నదీ ధరా
భారము రాజసం బపుడె పాయు శిరోభరమంతఁ దగ్గెడున్.

శా. సోమార్కేతర వంశజుల్ తదితరుల్ శుద్ధైహికానందు లీ
భూమిం బాలనసేయు వారలపదంబుల్ ద్రొక్కుచున్ గౌరవ
శ్రీమూలన్ బడి కుందఁ బూర్వులకు దుష్కీర్తిం బొసంగించుచున్
సామాన్యుల్ బలె మీ కులీనులు చరించం గాల మేతెంచెడున్.

పాండు-(తనలో) అక్కటా! "గోరుచుట్టుపై రోఁకటిపోటు" టన్నట్టు లీ యపచారము గూడ సంభవించినదే! (ప్రకాశము) మహాత్మా!

ప్రభుత్వదోషసంజనితంబగు నీ యపచారము సహింపుఁడు. నేనే తమ్ము నయ్యెడకుం గొంపోయెదను. (ముటుకొనఁ బోవును)

కింద - (కోపముతో) నన్ను ముట్టుకొనకుము. యోజించి చూడ నీకన్న వీని తక్కువ యేమియును గనుపట్టదు.

ఉ. నీవును వీనిఁబోలె వని నిత్యమునుం జరియించుచున్ వృథా
గా వధియించుచుంటివి మృగంబుల నాఁకటికై, కృపారసం
బావలి కేగు నిన్నుఁ గనినంతనె జన్మముతోడనేమి? దు
ర్భావులు సర్వథా దురితభాక్కులు వాక్కులు పెక్కులేటికిన్.

(కిరాతుని దిక్కైకి) ఓరీ! నన్ను శీఘ్రముగా నిర్దిష్టప్రదేశమ్మునకుం గొనిపొమ్ము.

మృగ- చిత్తము. (తత్సహితముగా నిష్క్రమించును.)

పాండు-(పశ్చాత్తాపముతో)

తే. గీ. జంతుహింసయె పాపప్రశంసతెరువు
అందులో బ్రహ్మహత్య! స్త్రీహత్య! యిదియు
నిట్టులుండఁగఁ గ్రీడించుపట్టు దీని
కెంతయో దుష్కృతము నిర్ణయింపఁ దరమె?

అక్కటా! యెంత దుర్మార్గుఁడనైతిని.

ఉ. వేఁటకు రాఁగ నేల? యవివేకము నింత వహింపనేల? యి
చ్చోటను నింతకాలము పశుల్ పశుతుల్యులు తోడునీడలై
పాటిల నుండనేల? యిటు పాపపుఁ గృత్య మొనర్ప నేల? యా
రాట మిదేల? యెంతటి పరాభవమున్ గయికొంటి దీనిచే?

(శరీరమువంకఁ జూచుకొని)

మ. కనుఱెప్పల్ గడువంగి చూపడఁగి వక్త్రంబెంతయున్ హేయమై
తనువెల్లన్ వళులై శిరోజముల చందంబెల్ల నిందార్హమై
కనఁగా రోఁత జనించు వృద్ధులును వాక్కంపమ్ముతోఁ గామినీ
జనులం గూడఁగ నన్నుబోఁటికకటా! శక్యంబె వైరాగ్యముల్?

(స్మృతి నభినయించి) ప్రియా సాంగత్యమ్మె మృతిప్రదం బగునని వచియించియు సంతానముమాత్రము కలుగునని యమ్ముని యానతిచ్చెఁ గదా! ఇది యెట్లు సంఘటిల్లును? ఇయ్యది కేవల మసంభవము. ఇఁక నే ననపత్యుఁడ నగుటయే ధ్రువము. (యోజించి) మును లమోఘవచస్కులుగదా? అట్టిచో నమ్ముని చెప్పినచొప్పు తప్పుటెట్లు? (విరక్తితో) ఇట్టి దుర్మార్గకృత్య మొనరించియును మరల నీ సంతానచింత యేల? నా కుదయించు కొమరులు నా కన్నను దుష్టులు కావచ్చును. నా కీఁక సంసార మును వలదు సంతానమును వలదు.

చ. పరమవిరక్తిమై నిచటి పాపపముల్ ఋద దీర్ప నిష్ఠమై
మరణముదనక నియ్యెడనె ప్రాన్పడి యుండెదఁగాక—
(విచారముతో) అక్కటా! తరుణులు కుంతి మాద్రియు నెదన్
ననుదూఱరె?—(విరక్తితో) దూఱనిమ్ము: సం
సరణముకన్నఁ గ్లీబునకు సన్న్యసనంబె వరమ్ముగాఁదగున్.

ఔరా! నేను గ్లీబుండ ననఁ గ్లీబుండను గాకపోతిని. (కోప ముతో) ఓ తపోధనా! నన్నుఁ గ్లీబునిఁగా శపింప కిట్లేల శపించితివి? (తల పంకించి) అవును. ఎట్లొనర్చుటకేని నీవెవరు? నే నెవరు? సర్వమును గర్మవశము.

తే. గీ. రుద్రుఁడు కపాలి చంద్రుఁడు రోగియాట
సూర్యుఁడు పరిభ్రమించు టించుకయు నన్య
కారణమ్మునఁ గాదది కర్మఫలము
సకలజగమును గర్మవశమ్మె సుమ్మి.

నే నియ్యెడనేయుండి తప మొనర్చికొందునుగాక. (యోజించి) నే నిచ్చటన యుంటినేని యిట కనతిదూరమ్మునన వసించు నా ప్రియురాండ్రు నన్నెట్లేని గుఱుతింప వచ్చును. పదఁపడి వారల వలన నా తపమ్ము విఘ్నమ్ము గావచ్చును. ఎన్నివిధమ్ములఁ జూచినను నా యొనర్చిన లోపముల కంతము లేక యున్నది. వేఁటకు వచ్చిన వాఁడను బ్రియురాండ్రం గూడ నెందుకు వెంటఁ

బెట్టుకొని రావలయును ? కానిమ్ము గతజలసేతుబంధనముతో నేమి ప్రయోజనము ? ప్రకృతము చూచుకోవలయును. (దృష్టి నిగిడ్చి) ఆ పర్వతప్రాంతమున నున్న వనంబులోని కరిగి య య్యెడ గూఢమ్ముగఁ దపమాచరించుకొందుఁగాక (పరిక్రమించి) ఈ పర్వతము గడు రమణీయముగ నున్నది. (లెక్కించి) దీని శిఖరములకుఁ బరిమితియే కానరాకున్నయది. శతశృంగ మను పర్వతం బిదియే కాఁబోలును.

ఉ. ఈదెసఁ బాఱుచున్న దొకయే అతినిర్మల మిందు నీరు మేల్
పాదపముల్ ఫలమ్ముల నపారముగా భరియించి యొద్దులం
దేదెసఁ బాడుకొన్న వది యే యొక పెద్ద తటాక మందు న
బ్జాదు లనేకముల్ సుమము లాత్మకు మెచ్చుదయింపఁ జేసెడిన్.

ఇది సర్వథా వాసయోగ్యముగాఁ గన్పట్టుచున్నది. కావున నే నియ్యెడనె తపం బొనరించి కొనియెద. (తపోనిష్ఠను నటించుచుఁ గూర్చుండును.)

[అంతఁ గుంతియు మాద్రియుఁ బ్రవేశింతురు.]

కుంతి- (విచారముతో) చెలీ ! ఆర్యపుత్రుండు మనల నెడఁబాసి యింత తడ వెన్నఁడును మసలుటలేదు. నేఁటి కొకటి గాదు. రెండుగాదు చాల దినములు గతించెఁగదా ! ఇప్పటికేని రాని హేతువేమో ?

మాద్రి-(విచారముతో) అక్కా ! యేమి చెప్పుదును ? ఎవరో యొక ఋషి శపించెననియు దానిచే విరక్తుండై శతశృంగమ్ము దాపున కరిగి యయ్యెడఁ దప మొనర్చుకొనుచుండెననియు నొక బోయత వలన నింతకు మున్నె వినియుంటిని.

కుంతి- (తత్తఱపాటుతో) ఎందుకు శపించెనో ? ఏమని శపించెనో ? కనుఁగొంటివా ?

మాద్రి-నే నా మాట వినినతోడనే నిర్విణ్ణురాలనై యేమియు మాట లాడలేక మిన్నకుంటిని. వలసినచో నిపుడు కనుఁగొనవచ్చును. దాని యునికిపట్టయ్యదియే.

కుంతి- అక్కడి కరిగి కనుఁగొని దయితు నోదార్చి తేర్చి తత్సహిత ముగాఁ బురి కరుగుదము ; రమ్మ. (నిష్క్రమింతురు.)

పాండు-(కనులు తెరచి) ఔరా ! తపోమహిమ !

ఉ. ఆస నశించెఁ, గామ మడుగంటెను, లోభము రూపుమాసె, ని
ష్కాసితమయ్యె మోహము, వికావికలయ్యె విచార, మెంతొ సం
తోసము నెంతయో దయయునున్ మదిఁబాదుకొనెన్ దపః క్రియా
భ్యాసము నిందుకే మునులు పాయరు రాజ్యము దీనిపాటియే ?

(స్మృతి నభినయించి) ఏమీ యీ పామరత్వము ? మరల నను వెనుకకు లాగుచున్నదే ! (తలపంకించి) అవును

ఉ. పున్నమచందమామ నెఱిఁ బోలెడి నెమ్మొగముల్ సుతారపున్
వెన్నెల నేలు నవ్వులును వింతవగల్ తళుకారుపల్కులున్
వన్నెలుఁ జిన్నెలుం జెలఁగువాఁడిమిచూపులు వాల్చుకన్నులున్
జిన్నఁగఁబుచ్చి యేఁ దపము చేసియు నన్నెముఁజేసి యొక్కటే.

(పెదవివిఱిచి) కాక చేసెడిదేమి ?

ఉ. అంగన లన్నఁబెద్దపులు లైరిగదా మునిశాపభీతి, న
ర్ధాంగులపొందులేనియపు డన్నియుఁ ద్యాజ్యము లౌనటన్న రా
జ్యాంగము లేల ? తక్కిన విహారము లేల ? యొకంట నెట్టులో
కుంగి యడంగియుండుటయె కూడు మఱేదియుఁగూడ దెమ్మెయిన్.

(నిట్టూర్పుపుచ్చి)

మ. మతి నూహింప సతీసుతాదిగతసంబంధమ్ము సర్వమ్ము క
ల్పిత మవ్వారలరక్షణార్థమ కదా ? లెక్కింపఁగారాని దు
ష్కృతులజ్ఞా దేహియొనర్చు టక్కటకటా ! యీ బంధమే యీజగ
త్థ్సితికిజ్ఞా గావలెనే ? మఱొక్కగతి నీచేఁగాదె ? లోకేశ్వరా !

(ప్రేమావేశముతో) పరమపతివ్రతామణులగు నాప్రేయసులారా ?

ఉ. ఏమియొనర్తు ? మీయెడల నేనువిరక్తుఁడఁగాను, వేఱుభా
మామణులజ్ఞా వరించి మిము మానినవాఁడను గాను మీరు న

న్నే మనుకొందురో యకట! యెందులకుం గొఱగానివాఁడనై
యీమెయి నుంటి నొక్కముని యింతటిదుర్దశ దెచ్చె నాయెసన్.

కాదు కాదు తప్పఁదలంచితిని.

మ. కరుణాసస్యము పాలి యూషర మమౌఘధ్వాంతపక్షాంత మీ
శ్వరసంసారవనీకుఠారము శుభాపస్మార మాయుష్య భా
స్కరరాహుగ్రహ మాధికారకము దుస్సంగంబు కూ్రిరక్రియాం
కుర మాఖేటక మిట్టిదుర్గతిని నాకుం గూర్చెఁ జల్పాదియై.

(దిక్కులు పరికించి) ఏమీ! ఇయ్యెడఁ బ్రియురాండ్రు లేనే లేరా? ఔరా మోహము నాకెట్టిభ్రాంతి పుట్టించుచున్నది. కానిమ్ము. ఇఁక నేనిఁ జిత్తమును గట్టిగా నిరోధము చేసికొని యీ తపస్స మాధియందుఁ బ్రివర్తింతుఁ గాక.

సీ. అవశుండనైతి మున్యపచారమును జేసి
కామమా! నన్నింకఁ గలఁచఁబోకు
విజ్ఞానినైతి నే నజ్ఞానకృతిఁ జేసి
మోహమా! నన్నింకముట్టఁబోకు
నీకారణముననే నాకీదశఘటించె
లోభమా! నాలోవెలుంగఁ బోకు
నీదునునిక్కి మునీంద్రుఁ డాదరింపకపోయె
మదమ! నన్నీమీఁదఁ గదియఁబోకు

తే. గీ. మెట్టులో కాలయాపన మిచటఁ జేసి
పరముఁగన నెంతు నాతోడఁ బంత మేల?
రమ్ము వైరాగ్యమా! శాంతి! రాఁగదమ్మ
దాంతిరో! వేగ రావమ్మ తపమ! రమ్మ.

(కనులు మూసికొని జపించును.)

[కుంతీ మాద్రులు ప్రవేశింతురు]

కుంతి- చెలియలా? ఆ చెంచెత చెప్పినప్రదేశ మిదియే. మన మిచ్చటనే వెదకవలయును.

మాద్రి-అవును. ఇది తపస్విజనోచితమై యున్నది. ఇక్కడనే తప్పక యార్యపుత్రుం డుండవచ్చును. (పరిక్రిమింతురు.)

కుంతి- (దృష్టినిగుడ్చి) అడుగో. ఆర్యపుత్రిుఁడు తపస్విజనోచితమ్మగు వేషమున నొప్పుచున్నాఁడు. దగ్గఱకుఁ బోవుదము రమ్మ. (అట్లొనర్తురు)

మాద్రి-(విచారముతో) అక్కా! ఎంతలో నెంతటి మార్పు కలిగినది. అఖండ తపస్సమాధిలోనుండి నాథుండు మనవంకకైనను జూచి నట్లు తోఁచదు.

కుంతి- అడుగో, కనులు విచ్చుచున్నాఁడు. చూచితివా?

పాండు-(తనలో)

చ. "వనితలపొత్తు చంచలము స్వప్నసమానము నాఁడు నాఁటికిన్
జను విరసమ్ముగా" ననుచు సారెకు నూఱువిధమ్ములన్ మనం
బునకు విరక్తిగల్గుటకు బోధ యొనర్చిన నప్పు డొప్పిన
ట్లనుమతిఁ జూపియున్ మఱవదంతర మేమియొనర్తు నింతులన్.

(దెసలు పరికించి ఆశ్చర్యముతో) ఏమీ! నాయనుంగు నెచ్చెలులు, నాపాలి భాగ్యదేవతలు, నన్నెట్టులో గుఱుతించి యియ్యెడకే వచ్చి యున్నారె! (విరక్తితో) ఛీ! మూఢచిత్తమా! యెందుకీ సంతోషము?

క. చండాలుభంగి దూర
స్థుండై వీఁడుండవలయుఁ దొయ్యలులకు నీ
గొండాట మింకనేటికి
దండుగ; వైరాగ్యమందుఁ దగులుము సుఖివై.

(తలవంచికొని) అక్కటా! వీరి నేమ్మొగమ్మునఁ జూడఁగలను? వీరితో నాయపరాధము నేమని చెప్పుదును?

చ. తనియరు కామినుల్ పురుషదర్శనమాత్రముచేత నెందుఁగా
మినులను పేరె చెప్ప నినుమిక్కిలి కామ మటంచు స్త్రీలయం

దెనిమిదిరెట్లు కామగుణ మేర్పఱచున్ స్మృతు లక్కటా మనం
బున నను సేవగింపరాకొ ? మోమునెడఁ బ్రియమాడిచూచినన్.
(తలవంచికొని విచారించును.)

కుంతి- (ఎదుటికరిగి) నాథా ! నమస్కారము. మమ్మిరువుర నయ్యర ణ్యమున డించి తామొంటిగ నేగుదెంచి యిట్లుండుట న్యాయమా ? భార్య భర్తకు సగము శరీరమని చెప్పు శ్రుతిస్మృతులు తామెఱుంగనివా ? ఇంతకు మే మొనరించిన యపరాధ మేమి ? ఏదేని గారణాంతరమున నిట్లుండవలసివచ్చినను ధర్మార్థకామముల యందు సహధర్మచారిణియగు కుటుంబిని ననాదరింపవలసిన యవసర ముండదుగదా ? మీరే యనాదరించిన మాకు గతి యెవ్వరు ? (అని కన్నీరుపెట్టుకొనును.)

పాండు-(తనలో) ఔరా ! సంగ మెంత చెడ్డది !

ఉ. పుట్టినతోడనే శుకునిపోలిక భీష్మునిభాతి విష్ణు రా
ట్టట్టులు నాంజనేయుగతి సంగనలం గయికోక మోక్షపుం
బట్టముకోసమై తిరుగువారికి స్వేచ్ఛయెసంగుఁగాని నా
యట్టిరు మోక్ష మందుటకు నైన మఱెందుల కైన రిక్తులే.

క. ఒకభార్యగలుగు మానవు
నకె స్వాతంత్ర్యమ్మునున్న నాకిర్వురుపీ
రకటా ! తప మేగతి నా
కిఁక సిద్ధింపంగనిత్తు రీకంజాక్షుల్ ?

ఇందేమి గతి ? ఇట్లగుఁగాక (ప్రకాశము) రాజపుత్రీ ! నాకుఁ దటస్థించిన దురవస్థ మీరును నారణ్యకులవలన వినియేయుందురు. కావున మీరు నన్ను నిరోధింపక నా వెనువెంట వేఁటకై వచ్చిన యనుచరులతో హస్తిపురికిం జని.

సీ. సత్యవతీదేవి సాన్నిధ్యమున కేగి
భీష్మునిఁజూచి యవ్విదురుఁ గాంచి
మాతల్లి దర్శించి మాయన్న నీక్షించి
మావధూనికకు నమస్కరించి

మా పురోహితుల సమ్మానించి మఱియును
　　　　పౌరవృద్ధులఁ బేర్మి గారవించి
అస్మదాశ్రితులగు నాగమవేత్తల
　　　　సత్కవిప్రవరుల సత్కరించి

తే. గీ. "అర్థమును గామమును సుఖ మఖిల మితర
　　మును బరిత్యాగ మొనరించి వనమునందుఁ
　　బాండుఁడున్నాఁడు వైరాగ్యపరత" నంచు
　　వినయమునఁ దెల్పు డోయలివేణులార !

ఇఁక నాకై విచారింపకుఁడు.

క. కృపణునివిత్తము, మూకుని
　　లపనము, విధవాంగనావిలాసము, పాథో
　　ధిపయఃపూరము, నాప్రా
　　యపుసొబగును, నొక్కరూప; యరుగుఁడు మీరల్.

కుంతి- నాథా ? మీకుఁ గలిగిన శాపంబు తెలం గెఱుఁగుదుము. దైవవశమ్మున వచ్చు కష్టసుఖములకు మనము విచారించిన నేమగును ? ఇంతకును విచారించి చేసెడిదేమి ? కావునఁ దాము ధైర్యమవలంబించి తమ యిచ్ఛానుసారముగనే యివ్వనమ్మున మాతోఁ గూడ నివసింపుఁడు. మేము మీ తపోనిష్ఠ కించుకయు భంగముఁ గలిగించెడి తెఱఁగునకుఁబోక జాగరూకతగలిగి వర్తించుచుందుము. మమ్మువీడుట తమకు న్యాయముగాదు. మేము మిమ్మువదలి రాజధానికరిగి మాత్రమేమి చేయవలసినదేమి ? వానప్రస్థాశ్రమమున భార్యాసహితముగఁ బ్రవర్తింపుటకుఁ గూడఁ గొందఱు ఋషుల మత మున్నదని వినియుంటిని. అక్కతమునకేకదా వసిష్ఠాదు లందఱును గృహిణీసమేతులై వనమ్మున వసియించెదరు. తాము వృథాగా మ మ్మెందులకుఁ బరిత్యజించి విచారనీరనిధి ముంచెదరు ? మమ్ముఁగూడ నియ్యెడ నుండునట్లానతిండు. భార్య

యనునది భర్తతో సుఖము మాత్ర మనుభవించుటకే యేర్పా టుగాలేదు. దుఃఖభాగిని గూడఁ గావలయుననియే పెద్దలు సెప్పుదురు.

పాండు-(తనలో) ఇప్పట్లి నీపె వాక్యము శాస్త్రసమ్మతముగను వ్యవహా రోపయుక్తమ్ముగను గనుపట్టుచున్నది. కాని యిందు ముప్పెన్నఁటి కేని యున్నదిగాని లేకపోలేదు. కావున నిట్లుకూడఁ జెప్పిచూచెద. పదఁపడి వారల యిష్టమువచ్చినట్లొనర్తురుగాక. (ప్రకాశము) తలోదరీ!

చ. సహజవిరక్తిగల్గు మునిచంద్రులు భార్యలతోడఁ గూడియుఁ
గహనమునందు నిష్ఠమెయిఁ గాలముపుత్తురుగాక యేమి దు
ర్వహమగు ప్రాయమందిటు విరాగ మరాగకృతంబుఁబూని యే
రహిఁదుదముట్ట నేరుతు గరంబును మీ పరిచర్యలొందుచున్.

తే. గీ. వ్యక్తిగలదాన వీవు లోపంబు రాక
యుండఁ గాపాడఁ గలవని యొప్పుకొన్న
ముగుద యెంతయు నీ నవమోహనాంగి
మాద్రిపట్టున నాకు నమ్మకము లేదు.

కుంతి- నాథా! మీకి సందియము లేశమును వలదు. ఈమె వయస్సున నాకన్నఁ జిన్నయయ్యు గుణాతిశయమున మిన్న యని మీకు నేను వేఱే చెప్పనక్కఱలేదు. మీ వ్రతమును మే ముభయుల మును సర్వవిధములఁ గాపాడుచుందుము. మా యునికికి సమ్మ తించి మమ్ముఁ బ్రతికింపుఁడు.

పాండు-(ప్రేమతో) ప్రేయసీ! దుర్వారమగు నీ ప్రతిబంధకమ్మునఁ గాని నాకు మాత్రము మిమ్ముఁ బరిత్యజింపవలయునని యున్నదా? కానిండు. నే నేమఱినను మీ రేమఱక జాగరూకతఁ గలిగి యశమ్ము సంపాదింపుదురు గాక.

మాద్రి-(తనలో) ఈమెకతన నాథుని సందర్శనభాగ్యము లోపింపక నాకుఁ దటస్థించినది. నేను ధన్యురాలను.

[అపటీక్షేపమున నొక భటుఁడు ప్రవేశించును.]

భటు - జయము జయము. దేవా! సేనాపతి తమయాజ్ఞకై యెదురు చూచుచున్నాఁడు. ఏమి సెలవు?

పాండు-నీ వరిగి, "పాండురాజు సభార్యుఁడై కొంతకాల మీ యడవి యందే మునివృత్తి నుండఁదలఁచినాఁ" డని మాయన్న మొదలగు నార్యులతో నివేదించునట్లు సేనాపతికి నా యాజ్ఞఁ దెల్పుము పొమ్ము.

భటు - చిత్తము. (నిష్క్రమించును.)

కుంతి- నాథా! ఈ సమీపారణ్యమం దెచ్చటనేని మున్యాశ్రమము లుండకపోవు. కావున మనమయ్యెడ కరిగి వారలవలనఁ బుణ్యగాథలు వినుచు నారణ్యకాచారము లభ్యసించుచుఁ గాలము పుత్తము.

పాండు-నీవు వచియించెడి దెఱఁగు గడు రమణీయము. అట్లే యొనర్తము. మునుల మహిమము లగాధములు. వారలే దేని తెఱఁగున నా కపత్యోదయంబుఁ గూడఁ బ్రసాదింపవచ్చును. అమ్మని నన్ను శపించునప్పుడు గూడ సంతాన ముదయించుననియే వచించి యున్నాఁడు. పదుండు పోవుదము.

(నిష్క్రమింతురు.)

గద్యం.

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁబడిన పాండవ జననమ్మనఁ షష్ఠాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

పాండవజననము

సప్తమాంకము

[అంత నొక సిద్ధాంతి ప్రవేశించును.]

సిద్ధాం- (తనలో) "గాంధారీమహాదేవికి మొట్టమొదట వట్టి మాంస పిండమే యుదయించుననియుఁ దుద కయ్యది నూఱుగురు కొమరులుగాను నొక కుమారికగాను బరిణమించు" ననియు నేను మున్ను చెప్పినప్రశ్న నిజమగుటచే నాకు ధృతరాష్ట్రమహారాజుగా రగ్రహారాదిక మిచ్చి మిక్కిలి గౌరవించియున్నారు. వారి యనుగ్రహముచే సుఖముగా రాజువలె గార్హస్థ్యము నడపికొనుచుఁ బంచాగమును వారిపేరుగనే రచింప మొదలిడితిని. కాని మరల నేఁడేదో యొక యత్యావశ్యకమైన ప్రశ్న చెప్పవలసి యున్నదని కబురంపి యున్నారు. ఈ ప్రశ్నగూడఁ దగినంత తార్కాణముగా ఋజువిచ్చినచో నా కింకను విశేషముగా బహుమానము తటస్థింపఁ గలదు. ప్రశ్నశాస్త్రము మంచిదే కాని దీనికొకదోషము కడుఁ బెద్దది తటస్థించినది. ఆ పార్వతికి జ్యోతిష్కులేమి మహాపకారము చేసిరో కాని యీ శాస్త్రము దృశ్యాదృశ్య మగునట్లు శపించినది. ఆ హేతువుచే నొకప్పుడిది తప్పిపోవుటయుం దటస్థించును. దానితో వెనుకనున్న గౌరవముఁగూడ "క్రొత్తనీరువచ్చి ప్రాఁతనీరును బోఁగొట్టిన" దన్నట్లు తుడిచిపెట్టుకొనిపోవును. అందుచేతనే వైద్యులకును జ్యోతిష్కులకును వేశ్యలకును బర మనోరంజనమే వృత్తికావునఁ బ్రతిదినగండమని చెప్పుదురు.

(వ్రేళ్ళులెక్కించి) ఇప్పటిగ్రహస్థితినిబట్టి చూడ నా జాతకము లాభకారిగనే యున్నది. కాననే "నాడిన దాటయుఁ బాడినది పాటయు" నగుటకు సందియములేదు. (పరిక్రమించి) అదుగో ధృతరాష్ట్రమహారాజు. పరమపూజ్యులగు భీష్మవిదురులతో నేదో ముచ్చటించుచున్నాఁడు. కొంచె మావిషయము పెదవియదల్పం బట్టి గుఱుతించుచు మెల్లఁగాఁ బోయెదను. ప్రశ్న విషయమున కిది యప్పుడప్పుడు కొంత సహాయమగుటయుం గలదు. (అట్లొనర్చును.)

[అంత ధృతరాష్ట్ర విదుర భీష్ములు ప్రవేశింతురు.]

విదు – అన్నా ! ఈ స్వప్నము కడు శుభప్రదమే ; ఏమో యతని కేదేవు ననుగ్రహముననేని యైదుగురు కొమరులును గలుగఁగూడదా ? వెనుక యువనాశ్వుని గర్భమున మాంధాత యుదయింపలేదా ? కాక యీ స్వప్నమున కీ విచారమేల ? ఇది శుభప్రదమే కదా ?

ధృత – (విచారముతో తుదముట్ట వినుము. అనంతరమున నా శిశువుల బాల్యముననే యతఁడు– (అర్ధోక్తితో విరమించి కన్నీరునించును.)

భీష్మ– (ధైర్యముతో) సరే తెలిసినది. స్వప్నములో నెవరు మృతి చెందినట్లు కనుపట్టునో అది వారి కెన్నఁడును దటస్థింపదని వాడుక యొకటి కలదు. కావున నీవిఁక బొత్తిగా విచారింప నవసరము లేదు.

ధృత –(కన్నీరు దుడుచుకొని అవును. పెద్దలిట్లులే చెప్పుదురు. ఐనను మనసు నిల్పలేక ప్రశ్నపూర్వకముగా నీ విషయమును దెలియ నూహించి మన సిద్ధాంతిగారికిఁ గబురుచేసితిని.

సిద్ధాం– (సమీపించి)

మ. గురుఁడున్ సూర్యుఁడు జంద్రుఁడుంగుఁజుడు శుక్రుండున్ బుధుండున్ శనై
శ్చరుఁడున్ రాహువుఁ గేతువున్ మిగుల విశ్వాసమ్ముతో మంగళ
స్ఫురణంబుల్ బొనరింత్రుగాక నిరతంబున్ మీరు నవ్వారలన్
గర మారాధన సేయుచుండుటకునై కాంక్షించి సస్నేహులై.

ధృత - స్వామీ! ఆసనము నధిష్ఠించి స్థిరచిత్తులరై యొక ప్రశ్నంబుం బురస్కరించుకొని యాలోచింపుఁడు.

సిద్ధాం- చిత్తము. (వ్రేళ్ళులెక్కించి యాకసమువంకఁజూచి) రాజా! ఈ ప్రశ్నము శుభాశుభమిశ్రఫలదంబుగా దోఁచుచున్నది. సావధానముగాఁ జిత్తగింపుదురుగాక.

ఉ. పాండునృపాలకుండటఁ దపం బొనరించుచు నుండి సంతు లే
కుండుటకై విచారమును నొంది పృథన్ గని యాజ్ఞ యీఁగ న
య్యండజయాన మంత్రబల మంది యమానిలజిష్ణులన్ మహో
ద్దండులఁగూడి తాఁగనె సుతత్రితయంబును ధర్మ్యపద్ధతిన్.

అంబరవాణి వారలకు ధర్మభీమార్జునులను నామధేయంబులొసంగె. పదఁపడి యయ్యనఘుం డింకను బుత్రులు గావలయునను తలంపున గుంతితో నిఁక నొక్కనిం గనుమన నాయమ ధర్మజ్ఞ గావున "నాథా! ఆపత్తునందుఁ గులముద్ధరించుట కేర్పడిన యీ ధర్మము మూఁగురవఱకేగాని యటుపై శాస్త్రము లొప్పవు. ఈ ధర్మము ననుసరించి నాల్గవ కొమరునిఁ గన్నది స్వైరిణియు నైదవపుత్రినిం గన్నది బంధకియు నగును" అని బోధించి యంతతో విరమించె——

ధృత - దైవజ్ఞ శిరోమణీ! కడుఁ జక్కగాఁ జెప్పితిరి. కాని, నాస్వప్నమునకును మీ ప్రశ్నమునకును స్వల్పభేద మగపట్టుచున్నది. మీరు మూఁగురనియే చెప్పినారు నా కేగురని కల చెప్పినది.

సిద్ధాం- రాజా! నేఁజెప్పఁదగిన దింకను నవశిష్టముగ నుండఁగనే తాము సెప్పఁబూనుకొన్నారు. శేషము వినుఁడు. పిదప నొకనాఁడు మాద్రి కుంతి సన్నిధిని లేకుండఁ జూచి "నాథా! తమకుఁ గలిగిన శాపప్రకారము నే నెఱింగియు నేను మిమ్ము నపత్యార్థమై వేడుకొనుచున్నందులకు మన్నింపుఁడు. మా యక్క కుంతి తనకుఁ జిన్ననాఁడు దుర్వాసుం డిడిన మంత్రప్రభావమునఁ గదా మూఁగురఁ గొమరులఁ బడసె. సవతి నగు నా కయ్యది

యెంత దుఃఖకరమో యోజింపుఁడు. నా తోడికోడలగు గాంధారికిఁ బుత్రశత ముదయించినను నా కిందు శతాంశమేని చింతలేదు సరి కదా! పై పెచ్చు సంతోషము కూడఁ గలిగినది. ఇది సాపత్న్య దోషము. కావున మీ రెట్లేని యాపెకు బోధించి యా మంత్రము నా కుపదేశించునట్లు చేసితిరేని నేనుఁ గూడ మీ యానతింజేసి వంశకరులగు కొమరులఁ బడసి కృతార్థురాల నయ్యెద" నను టయుఁ బాండుఁడు సంతానమ్మున నింకను దనియనివాఁ డగుటం జేసి కుంతితోఁ జెప్పి యాపెకా మంత్రమిప్పించిన మద్రరాజ పుత్రియు నమ్మంత్రబలమ్మునంజేసి——

తే. గీ. అందమునయందుఁ దేజమ్మునందు మిగులఁ
బేరుఁ బెంపును గైకొన్న వేల్పు వెజ్జు
లిరువురంగూడ రప్పించి యిగురుఁబోఁడి
నకుల సహదేవు లనెడి పుత్రకులఁ గాంచె.

[విరమించుట నటించును]

ధృత - (తనలో) ఇక్కడికి శుభఫలము పరిసమాప్తమైనది కాఁబోలును. ఈ యనఘుఁడు చెప్పుట విరమించినాఁడు.

భీష్మ - సంశయించెదరేమి? శేషముగూడ వచింపుఁడు.

తే. గీ. కష్టమగుఁగాక సుఖ మగుఁగాక ప్రాప్త
మైనదానిని వచియింతు రంతె కాని
మీరు తెచ్చిపెట్టరుగదా? మీకు నేఁటి
సంశయము? సత్యమున కింత చర్చయేల?

విదు - (తనలో) పిదప నేమివిన్నను, "అతనికిఁ బుత్రు లుద్భవించి" రను వార్త వినుటచే నా శ్రవణములు కృతార్థము లైనవి.

సిద్ధా - మీరందఱును బ్రాజ్ఞులు గనుక వచించుచుంటినికాని యితరుల కైనచో మంచియేకాని చెడ్డ చెప్పుటకు దైవజ్ఞు లొప్పరు. పదఁ పడి మాద్రింజూచి "మఱియు నొక్కకుమారుం గను" మని యాంబాలికేయుండు పలుక నాపె నాకమ్మంత్ర మొకసారికి

మాత్రిమే యుపయోగించినది. కాని యింక నుపయోగించునట్లు కనుపట్టదనవుడు, గుంతింగని "యింతులకుఁ గారణమే" మన నాపె "యదిమంత్రిదోషముగాదు ఈమె బుద్ధిదోషము, ఏమన ఏకవార మిరువురఁ గోరుటచే నమ్మంత్రరాజంబు కుపితంబయ్యె" ననివచియింపఁ, దిరిగియు నుపదేశింపు మనుటయుఁ గుంతి"ఇట్టి యవివేకినుల కీమంత్ర మీఁదగ" దని నిష్కర్షగాఁ జెప్పుటయు నతండు మిన్నకుండె. పదఁపడియొక్కనాఁడు వసంతసమయ మునఁ గుంతి సన్నిధిని లేకున్నయెడ—

చ. వలదని మాటిమాటికి నివారితుఁడయ్యును గామబాణసం
చలితమనస్కుఁడై తపసిశాపము నెంచక మద్రరాట్సుతన్
గలిసి, గతాసుఁడై చనియెఁ. గాముకులై తగువారు చావునన్
దలఁప రటన్న వేతొకవిధం బగుహాని దలంప నేర్తురే ?

ధృత- (దుఃఖముతో) హా ! సోదరా ! కురుకులమునకు వన్నె తెచ్చి యింత స్వల్పవయస్సునే యంతరించితివా ?

చ. దిశలు జయించినావు ఘనతేజుల రాజుల నెల్ల నింతలో
వశముగఁజేసినావు బలవంతుల కెల్లను గుండె నీఱుగా
యశము గడించినా వకట ! యమ్మునిశాపము చుట్టుముట్టి దు
ర్దశ ఘటియించెనే? యిటకుఁదమ్ముఁడ! మమ్మిఁకఁజూడరావుగా ?

అయ్యో ! సోదర ! నీవు నాఁడు "తపస్వినైతి" నని తెల్పుచు ననుచరునిచే నంపిన నమస్కారమే మాకెల్లరకును దుదినమ స్కారమా ? నీవంటి భక్తిగల సోదరుఁ డెన్నిజన్మము లెత్తినను దటస్థింపఁడుగదా?

క. నేనంధుఁడనయ్యును నీ
చే నెల్లజగమ్ము నాకుఁ జేతికి వచ్చెన్
మానించి రెల్ల నృపు లీ
పై నాకొక్క రుఁడుఁగూడఁ బలుకఁడు సుమ్మీ !

విదు - అన్నయ్యా ! ఆయన శాస్త్రమును బట్టికదా చెప్పినాఁడు. అది

యొకప్పుడు నిజమైనను మఱొకప్పు డసత్యమును గావచ్చును. వృధాగా నెందులకుఁ జింతించెదవు? మనచే నంపఁబడిన యను చరుఁడు వచ్చు దనుక ధైర్య మవలంబింపుము.

భీష్మ- కుమారా! ఒక్కచో నిక్కమేయయినను విచారముతగదు. ఊఁఅడిల్లుము. (సిద్ధాంతి దిక్కయి) పదఁపడి సంగతి సెలవిందు

సిద్ధాం- ఇఁకఁ జెప్పఁదగిన దేమున్నది. ఇట్లుతండు గతాసుండగుటయు,

తే. గీ. చెట్టువడినంతఁ జెట్టును జుట్టుకొన్న
తీవయునుబోలె నపుడు మాద్రీసుమాంగి
యానృపాలునిపైఁబడి యడలసాగెఁ
గాంతలకు నింతకన్న దుఃఖంబు కలదె?

తే. గీ. కుంతియును నట్లొనర్చెఁ దత్సంతతియును
గరము దుఃఖించె మునివరు లరుగుదెంచి
వారి వారించి పాండుభూపతికి నుత్త
రక్రియలు దీర్చిరంత విధిక్రమమున.

మాద్రి, తనకతమున భర్తమృతి చెందె నను విచారముతోఁ బుత్రులఁ గుంతికప్పగించి యచ్చటిమునిజనులు వలదని యెన్ని విధములఁ జెప్పినను వినక సహగమనం బొనర్చె నేఁటి కీసంగతి జరిగి పదియేడు దివములైనది. ఇప్పుడో యిఁకనో ఋషివరులు గొందఱు పాండుపుత్రులను గుంతిని వెంటఁ బెట్టుకొని యిక్కడికే వచ్చుచున్నట్లు పొడకట్టినది. ఇది శాస్త్రము ననుసరించి నా వచించుట. ఆ యా గ్రహములన్నియు మీయెడలఁ గృపగల్గి మీకు సమస్తమంగళములను జేకూర్తురుగాక!

ధృత- మహాత్మా! ఇన్నిసంగతులు తెలిసిన మీకిది గోచరమగుట యొక కష్టముగాదు. కాన నడుగుచున్నాఁడను. మాతమ్ముని కొమరుల కించుమించుగ నిప్పెడెంత వయస్సుండునో?

సిద్ధాం- (లెక్కించి) రాజా! ఇంచుమించేల? సరిగానేచెప్పెద నవధరింపుము.

తే. గీ. పదియునా ఱేండ్లు ధర్మసంభవునివయసు
అంతకొకయేడు తక్కు వయ్యనిలజునకు
ఇంద్రసుతునకుఁ బదునాలుగేండ్లునిండెఁ
గవలకుఁ ద్రయోదశాబ్దముల్ కౌరవేంద్ర!

ధృత - అట్లయిన భీముఁడును దుర్యోధనుఁడును సమానవయస్కులు.

సిద్ధాం- సమాన వయస్కులనఁగా నొకచేదినమున నుద్భవించినారని యర్థము చెప్పికొనవలెను.

ధృత - ఔరా! ఈ సిద్ధాంతి పాండిత్యము! గడియలతోడను నిమిషములతోడను 'తూచా' తప్పకుండఁ జెప్పుచున్నాఁడు. కానిమ్ము. ఇందు నిజమెంతో అబద్ధమెంతో యిప్పుడే రాఁబోవు ఋషులవలనఁ దెలిసికోఁదగు.

[ప్రతీహారి ప్రవేశించును]

ప్రతీ - జయము జయము దేవా! ఋషులుగొంద ఱొకవిధవాంగనయును నిరుపమానతేజస్కులగు నేవురుబాలురును వెంటఁజనుదేర వచ్చి ద్వారమున నున్నారు.

భీష్మ- (తనలో) ఆ బాలకులు పాండవులు. ఆమె కుంతి. నిస్సంశయము. (ప్రకాశము) ప్రవేశపెట్టుము.

ప్రతీ - చిత్తము. (నిష్క్రమించును)

[అంతఁ గుంతియుఁ బాండవులును ఋషులును బ్రవేశింతురు.]

విదు - (ఋషులతో) మహాత్ములారా! ఆ యాసనము లలంకరింపుఁడు.

(ఋషులందఱును గూర్చుందురు.)

భీష్మ- (నమస్కరించి) మహామహులగు నో ఋషిపుంగవులారా! భవద్దర్శనంబునఁ జేసి మా పురంబెల్లఁ బవిత్రమయ్యె. మా రాజ్యమును మేమును మీయధీనము. మీ రాకకుం గతమేమో? యానతీయ వేఁడుచున్నాఁడను.

విదు - (తనలో) మన సిద్ధాంతి వచించినదంతయు నిశ్చయమే. తగిన ప్రవేశమున్నచో శాస్త్రము లెన్నఁడును నసత్యములు కావు.

ఋషి- (లేచి) రాజా!

ఉ. పౌరవవంశవర్ధనుఁడు పాండునృపాలుఁడు మా వనంబులో
ఘోరతపంబుఁజేసి తనకున్ మృతికాలము రాఁగ మాద్రియన్
దారను గూడి శాపముకతమ్మున స్వర్గ మలంకరించె న
వ్వీరునిపుత్రి లేవురును విశ్వజనీనకళాధురంధరుల్.

[ధృతరాష్ట్రాదులు కన్నీరునింతురు.]

ఋషి- ఎందుకు విచారించెదరు? అతనిం గూర్చి మీకన్న మాకు విచా రింపవలసి యున్నను, విచారించి చేయునది లేక దిగమ్రింగితిమి.

తే. గీ. కొందఱకు నన్నగా మఱికొందఱకును
దమ్ముఁడుగ శిష్యభంగిఁ గొందఱకు గురువు
చందమునఁ గొందఱకు నాతఁడందు మాకు
నరమర యొకించుకయు లేక యధివసించె.

కుంతి- (తలవంచి కన్నీరు నించును.)

భీష్మ- (తనలో) వీరు దేవప్రసాదమ్మునఁ గలిగిన సంగతి యథార్థమే. అయినను లోకారాధనమునకై యీ ఋషులతోఁ గొంత ప్రసం గింపకమున్న యీ పసిబాలురను గైకొనుట యంత మంచిపని కాదు. (ప్రకాశము) స్వామీ! మా కీ సందియముం దీర్పుఁడు. మా పాండురాజునకు మునిశాపంబు తటస్థించెఁగదా! ఈ సంతాన మెట్లుదయించినది?

ఋషి- మీరిట్లు సంశయింతు రని యోజించియే కదా మే మందఱమును నియ్యెడకు రావలసివచ్చినది. ఒక్కనాఁడు మే మెల్లరమును గలిసి బ్రహ్మలోకమ్మున జరుగు సభకుఁ బోవుచుండ మా తోడ నీతండు గొంతవఱకు వచ్చి రాఁజాలక మమ్మంగాంచి, 'నే ననప త్యుఁడ నగుటచేఁ గాఁబోలు నా కీ మార్గమ్ము దుర్గమమ్ముగా నున్నది. 'అపుత్రస్య గతిర్నాస్తి స్వర్గో నైవచ' అని మీ వంటి పెద్దలు వచింతురని విచారించుచుండ, మే మాతనియెడ సస్నే హులమై దివ్యదృష్టిం జూచి "రాజా! యెందుకు విచారించెదవు?

నీకు దేవదత్తంబగు నసత్యంబు నిర్ణీతంబై యున్న" దని చెప్పితిమి. పదఁపడి యీ మహాభాగతో నాతండు యోజింపఁ దనకు దుర్వాసుం డిచ్చిన మంత్రంబుం జపించి యీమె యీ మూఁగురు కొమరులం గనియె. ఆ మంత్రబలముననే యీ యిరువురను మద్రరాజపుత్రి ప్రసవించె. వీరలకు జాతకర్మము మొదలుపనయనము వఱకును మా వలననే యయ్యనఘుండు జరిగించె. (చేతఁజూపుచు)

ఉ. అతఁడు ధర్మరాజు యము నంశముననన్ జనియించినాఁడు ప్ర
ఖ్యాతగుణాకరుండు త్రిజగమ్ముల నీతనికీర్తి నిండు నిం
కీతనితోడఁ దుల్యుఁడు మఱెందు జనింపఁడు వాస్తవమ్మ; మీ
రీతనిచేఁ దరింతు రిది యేను దపంబునఁజేసి తెల్పితిన్.

ఉ. భీముఁడితండు లోకములు పెల్చన నొక్కట నెత్తివచ్చినన్
వే మడియించు నయ్యనిలవీర్యసముద్భవుఁ డొక్కనాఁ డితం
డీమె కరంబునుండి పడి యెత్తగు గ్రావము నుగ్గుఁజేసి నాఁ
డామెయిఁ బాలుద్రావునపు; డచ్చెరువందె మునీంద్రసంఘముల్.

మ. అతఁడే యర్జునుఁ డక్కుమారుజనకుం డాఖండలుం డింక నీ
క్షితియందొక్కటఁగాదు వీని కెచటం జేట్పాటు వాటిల్ల దు
న్నతమా చాపము చూచినంతన రిపుల్ నష్టాశులై కేలు మో
డుతు రీ వీరుపరాక్రమమ్మునకు నీడున్ జెప్పఁగా శక్యమే?

చ. నకులుఁ డితండు వీనిదగు నామము విన్న రిపుల్ హతాశులై
తికమక గాంత్రు; వాఁడె సహదేవుఁడు తగ్గఁడొకింతయేని య
న్నకు నొకటన్, గవల్ కడుఁ గనందగు వీరల సొంపు దస్రపు
త్రకులు గుణాకరుల్ గడుఁదిరంబగు వీరియశంబు దిక్కులన్.

మీ కింకను ప్రమాణాపేక్ష కలదేని యద్దేవతలే సాక్ష్యమిత్తురుగాక?

[ఆకాశమువంకఁ జూచును]

(తెరలో)

చ. అగునది నిక్కవంబు ఋషు లాడుదురయ్యె యసత్య మెల్లరున్
గగనమువంకఁ గన్గొనుఁడు కాలుఁడ నే ననిలుం డితండు దే
వగణవిభుండతండు సురవైద్యులు వీరు మునీంద్రు మంత్రమున్
మగువలు మమ్ముఁగూర్చి మననం బొనరింప జనించి రీసుతుల్.

[అందఱును ఆశ్చర్యముతో నాకసమువంకఁ జూచుచు నాకర్ణింతురు.]

ఋషి- (భీష్మాదులదిక్కై) ఇంతకన్నను మీకు మే మొనరింపఁదగు ప్రియమేమి? అయిన నిట్లగుఁగాక!

[భరతవాక్యము]

మ. కలుగుఁగాక! యశమ్మునం బ్రజలకుం గాఢానురాగంబు భా
సిలెడుంగాక! సుఖమ్ము లెల్లరకు సుశ్రీ యెల్ల దేశమ్ములన్
వెలయుంగాక! యపాత్రులైన కుకవుల్ వేవేపరాభూతులై
తలవంపున్ గయికొంద్రుగాక! ఋతమే దైవారుఁగా కెల్లెడన్.

మఱియును.

ఆ. వె. పక్షపాతులైన కుక్షింభరుల యుచ్చ
యోగ మడఁగుఁగాక యోగ్యులైన
కవుల వాక్కులందుఁ గాళీమహాదేవి
నిలుచుఁగాక నిజమె గెలుచుఁగాక.

గద్య

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి
బాలసరస్వతీ శతావధాని తిరుపతి వేంకటేశ్వరులచే
రచియింపఁబడిన పాండవజననమ్మున
సప్తమాంకము.

ముఖ్యమగు సవరణలు.

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
10	19	వసిష్ట	వసిష్ఠ
12	15	లేదో	లేదా
12	17	అనాఘా	అనఘా
13	22	వంతం	వంత
16	1	అపొద	ఆపొద
20	6	మెత	మెంత
30	25	బ్రిజ్ఞా	ప్రిజ్ఞా
32	23	కడిచి	కడచి
35	6	కొందుమ	కొందమ
35	6	యను	యనను
41	20	నటి	నట్టి
43	4	విలచు	వించు
43	20	దూచితే	చూచితే
46	24	హెహాయు	హైహాయు
47	8	స్పృహా	స్పహా
48	7	వంచింపు	వచింపు
53	6	భావ౯	భావు౯
56	22	గుజ	గుజ్జ
56	24	నాయినా	నాయనా
65	21	దినిచే	దీనిచే
70	23	నేమ్మొగ	నేమొగ
76	27	సేయొ	సేయు
82	25	నెవచ	నైవచ
84	10	కలుగు౯	కలుగుం